www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్
05 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 240

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## కొండా సురేఖకు మరో ఝలక్



- సచివాలయ చాంబర్ స్వాధీనం
- గన్‌మెన్ల ఉపసంహరణ
- బుల్లెట్‌ప్రూఫ్ వాహనం వెనక్కి
- ఫేక్ ఫేస్‌బుక్ పోస్టు వైరల్
- అధికారిక ఖాతాలనే నమ్మాలన్న సురేఖ

02

## కొండా సురేఖ స్థానంలో రాములమ్మ?



- కొండా సురేఖ స్థానంలో కొత్త మంత్రి
- రెండు ఖాళీ బెర్తుల భర్తీకి కసరత్తు
- మహేశ్ గౌడ్‌కు డిప్యూటీ సీఎం ఛాన్స్
- విజయశాంతి పేరు మంత్రి పదవికి పరిశీలన
- బలరాం నాయక్‌కు పీసీసీ చీఫ్ అవకాశం
- చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పోస్టులపై కసరత్తు

02



## నేనూ సీఎం అవుతా!

- సీఎం కావాలనుకుంటున్నా:కవిత బహిరంగ ప్రకటన
- హరీశ్‌రావు భార్యకు సవాల్, పోటీకి సిద్ధమని స్పష్టం
- రేవంత్‌పై విమర్శలు పాలన తీరును టార్గెట్ చేసిన కవిత
- ఇంటర్ విద్యపై డిమాండ్, రద్దు చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- ఆకునూరి మురళి కమిషన్‌పై ప్రశ్నలు, సిఫార్సుల అమలుపై నిలదీత
- బీఆర్ఎస్‌లో కొత్త చర్చ, కవిత రాజకీయ భవిష్యత్‌పై ఆసక్తి

03



## ఒవైసీలకు దేశభక్తి సర్టిఫికెటా?



- ఒవైసీ సోదరులను దేశభక్తులుగా పేర్కొన్న రేవంత్ వ్యాఖ్యలపై వివాదం
- సీఎం వ్యాఖ్యలపై రామచందర్ రావు తీవ్ర విమర్శలు
- వందేమాతరం సమయంలో మజ్లిస్ ఎమ్మెల్యేల వైఖరిపై ప్రశ్న
- గత ఒవైసీ వ్యాఖ్యలను బీజేపీ అధ్యక్షుడు ప్రస్తావించారు
- ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే ప్రశంసలు అంటూ ఆరోపణ
- దేశభక్తిపై రేవంత్ స్పష్టమైన నిర్వచనం చెప్పాలని డిమాండ్

03



## అసెంబ్లీకి రాని ప్రతిపక్ష నేత ఎందుకు?

- కేసీఆర్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలి
- గాంధీభవన్ నుంచి అమరవీరుల స్థూపం వరకు కాంగ్రెస్ భారీ ర్యాలీ
- రోహిత్ ఆధ్వర్యంలో నిరసన.. జక్కిడి శివచరణ్ రెడ్డి హాజరు

04



# వెయ్యి రోజులు అన్నీ గొడవలే..!

- కొండా సురేఖ ఉద్వాసన
- చిన్నారెడ్డి, జక్కిడిలపై వేటు
- రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు
- 22-A భూముల వివాదం
- వెయ్యి రోజులపై వివాదాల నీడ
- పాలన కంటే గొడవలపైనే ఫోకస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న వేళ సాధించిన విజయాలను ప్రజలకు వివరించాల్సిన సమయం వచ్చింది. కానీ ప్రస్తుతం ప్రభుత్వానికి అభివృద్ధి కంటే రాజకీయ వివాదాలే ఎక్కువ ప్రచారం తెస్తున్నాయి. కొండా సురేఖ మంత్రి పదవి కోల్పోవడం, ఆమె కుమార్తె సుష్మిత చేసిన ఆరోపణలు, సీనియర్ నేతలపై చర్యలు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు, 22A భూముల సమస్యలు వరుసగా చర్చకు వస్తున్నాయి. దీంతో వెయ్యి రోజుల మైలురాయి పాజిటివ్ కార్యక్రమంగా మారాల్సిన చోట పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఫోకస్ పడింది. సాధారణ ప్రజలకు కూడా ఇప్పుడు ప్రభుత్వ పనితీరు కంటే కాంగ్రెస్‌లో ఏం జరుగుతోందనే ఆసక్తి పెరిగింది. ఈ పరిస్థితి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజకీయంగా అసౌకర్యాన్ని కలిగిస్తోంది. పాలనలో చేసిన పనులను చెప్పుకోవాలంటే ముందు పార్టీలోని అసంతృప్తికి బ్రేక్ వేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇది ప్రభుత్వానికి కీలక రాజకీయ పరీక్షగా మారింది, పార్టీ సమన్వయం ఎంత బలంగా ఉందో చూపించే అత్యంత కీలక సందర్భం కూడా అవుతోంది . కొండా సురేఖ వ్యవహారం ఈ రాజకీయ వేడికి ప్రధాన కారణంగా మారింది. రేవంత్ రెడ్డి నాయకత్వంపై కొండా కుటుంబం నుంచి వచ్చిన అసంతృప్తి బహిరంగ చర్చగా

మిగతా 2లో..

## కృష్ణా జలాలపై మళ్లీ వార్

- విద్యుత్ ఉత్పత్తికి నీటి విడుదల వద్దు
- పోతిరెడ్డిపాడు విడుదల నియంత్రణ
- తాగునీటికి తొలి ప్రాధాన్యత
- 50:50 నిష్పత్తి కోరిన తెలంగాణ
- 66:34 నిష్పత్తి కోరిన ఏపీ
- సెప్టెంబర్ నాలుగో వారంలో తుది భేటీ

02



## కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రాష్ట్రంలో కరువు పరిస్థితులు



- ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏమయ్యాయి..? మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- ఆరు గ్యారంటీ హామీలు ఎక్కడ..?
- తులం బంగారం, మహిళలకు స్కూటీలు, రూ.2,500 హామీ ఏమైంది?
- రూ.500కే గ్యాస్ అన్నది ఏమైంది..? రూ.1,050కే సిలిండర్ ఇస్తున్నారు
- పెన్షన్ల పెంపు, కేసీఆర్ కిట్ బిసి బంధు, ఎస్సి బంధు వంటి పథకాలు ఏమయ్యాయి?
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పనులు ఎక్కడా కనిపించడం లేదు
- ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు
- ఆరుట్లలో బీఆర్ఎస్ నిరసన

06



## నాణ్యతలో రాజీ వద్దు

- రైతుల భూముల సేవకు సీఎం గుర్తింపు
- రైతు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు
- కళాశాల పనులు గడువులోగా పూర్తి చేయాలి
- నిర్మాణ నాణ్యతపై రాజీ వద్దు
- స్థానికుల నుంచి విజ్ఞాపనలు స్వీకరణ

02

మద్దూరులో విద్యాసంస్థల పనుల పరిశీలన



## రాహుల్ గాంధీపై కేసు దర్యాప్తు స్పీడప్

- ఎఫ్ఐఆర్ పత్రాలను పరిశీలించిన పోలీసులు
- శుద్ధీకరణ వ్యవహారంపై భగ్గుమంటున్న కాంగ్రెస్
- సెప్టెంబర్ 7న ఉత్తరఖండ్ సీఎం నివాసం ముట్టడికి పిలుపు

03

## 33 నెలలు.. రూ.66 వేల బాకీ



- రూ.4,000 పెన్షన్ హామీపై హరీశ్ రావు ప్రశ్నలు
- 33 నెలల్లో రూ.66,000 బాకీ అంటూ ఆరోపణ
- 3.5 లక్షల పెన్షన్లు రద్దు చేశారని విమర్శ
- రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలపై ప్రభుత్వాన్ని టార్గెట్
- కాంగ్రెస్ పాలనలో కబ్జాలు, కుంభకోణాలు పెరిగాయని ఆరోపణ
- కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని హరీశ్ రావు ధీమా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో తెలంగాణ అభివృద్ధి కనిపించడం లేదని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో బీఆర్ఎస్ సమరభేరి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వంటావార్పులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పాలన కంటే కబ్జాలు, కుంభకోణాలు, లూటీలు, సెటిల్‌మెంట్లు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్ల విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని మండిపడ్డారు. రూ.4,000 పెన్షన్ హామీ ఇచ్చి 33 నెలలు గడిచినా అమలు చేయలేదని ప్రశ్నించారు. ఒక్క కొత్త పెన్షన్ ఇవ్వకపోగా, ఇప్పటికే ఉన్న 3.5 లక్షల పెన్షన్లు రద్దు చేశారని ఆరోపించారు. దీంతో పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను

మిగతా 2లో..

# కృష్ణా జలాలపై మళ్లీ వార్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కృష్ణా జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. శ్రీశైలం నాగార్జునసాగర్ జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వల నేపథ్యంలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కీలక సూచనలు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసం ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటిని విడుదల చేయవద్దని రెండు రాష్ట్రాలకు స్పష్టం చేసింది. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను నియంత్రించాలని సూచించింది. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలను ముందుగా పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది. ఉమ్మడి జలాశయాల్లో నీరు తక్కువగా ఉన్నందున పొదుపుగా వినియోగించాలని పేర్కొంది. కష్టకాలంలో తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని విభజన చట్టం నిర్దేశిస్తోందని కేఆర్ఎంబీ గుర్తుచేసింది. బోర్డు సూచనల ప్రకారం తాగునీటి భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ నీటి వినియోగంలో జాగ్రత్త పాటించాలని పేర్కొంది. ప్రస్తుత నిల్వలు భవిష్యత్ అవసరాలకు సరిపడేలా విడుదలలపై నియంత్రణ అవసరమని సూచించింది. రెండు రాష్ట్రాలు పరస్పర ఆరోపణలు తగ్గించి అందుబాటులో ఉన్న నీటిని సమన్వయంతో వినియోగించాలని బోర్డు అభిప్రాయపడింది. ఈ సూచనలతో కృష్ణా జలాల వివాదం మరింత కీలక దశకు చేరింది. శ్రీశైలం నుంచి తెలంగాణ విద్యుదుత్పత్తిపై ఆంధ్రప్రదేశ్ కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కారణంగా జలాశయ నిల్వలు వేగంగా తగ్గుతున్నాయని ఏపీ ఆరోపించింది. దీనిపై స్పందించిన కేఆర్ఎంబీ తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ పంపింది. విభజన చట్టంలోని నిబంధనలను పాటించాలని సూచించింది. విద్యుత్ అవసరాల కంటే సాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపింది. సాగునీటి కంటే తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. తాగునీటి అవసరాలను రక్షించాలని తెలంగాణను కోరింది. ఇదే విషయాన్ని గతంలో పలుమార్లు సూచించినట్లు బోర్డు లేఖలో



పేర్కొంది. లేఖలో జలాశయాల్లో నిల్వలు పరిమితంగా ఉన్న విషయాన్ని బోర్డు ప్రత్యేకంగా ప్రస్తావించింది. నీటి విడుదల నిర్ణయాల్లో ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. విద్యుదుత్పత్తి పేరుతో అదనపు నీటిని దిగువకు వదిలితే తాగునీటి భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపింది. రెండు రాష్ట్రాల అధికారులు బోర్డు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని మరోసారి స్పష్టం చేసింది. తాగునీటి అవసరాలకు ఇబ్బంది కలగకుండా విడుదలలపై సమన్వయం అవసరమని సూచించింది. హైదరాబాద్ జలసౌధలో కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన భేటీలో తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి పాల్గొన్నారు. ప్రస్తుత నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, శ్రీశైలం నాగార్జునసాగర్ పరిస్థితి, నీటి విడుదలపై చర్చించారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ మార్గాల ద్వారా ఏపీ అధిక నీటిని తరలిస్తోందని తెలంగాణ అభ్యంతరం తెలిపింది. శ్రీశైలం వద్ద తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తోందని ఏపీ వాదించింది. నీటి వాటా విషయంలో భిన్నాభిప్రాయాలు కొనసాగడంతో ఏకాభిప్రాయం కుదరలేదు. చివరకు పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో ఇరు రాష్ట్రాల అధికారులు వాదనలు వినిపించారు. తెలంగాణ ప్రతినిధులు పాత నిష్పత్తిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏపీ ప్రతినిధులు తమ రాష్ట్రానికి కేటాయించిన నీటిని వినియోగించుకుంటున్నామని వివరించారు. తక్షణ విడుదలలపై పరస్పర అంగీకారం రాకపోవడంతో అంశం పూర్తి స్థాయి బోర్డు ముందుకు వెళ్లింది. సెప్టెంబర్ నాలుగో వారంలో జరిగే భేటీపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలో పంచాలని తెలంగాణ కోరింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నందున తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని రమేశ్ బాబు తెలిపారు. పాత 66:34 నిష్పత్తిని కొనసాగించడం ప్రస్తుత పరిస్థితులకు సరిపోదని తెలంగాణ వాదించింది. రాష్ట్ర అవసరాల దృష్ట్యా తెలంగాణకు మొత్తం 200 టీఎంసీల నీరు అవసరమని పేర్కొంది. పోతిరెడ్డిపాడు నుంచి నిబంధనలకు విరుద్ధంగా నీటి తరలింపు జరుగుతోందని ఆరోపించింది. వెలిగొండ నుంచి కూడా నీటిని తీసుకుంటున్నారని తెలిపింది. ఈ అంశాలన్నింటినీ సెప్టెంబర్ నాలుగో వారంలో జరిగే పూర్తి స్థాయి సమావేశంలో సమగ్రంగా చర్చించాలని కోరింది. తాగునీటి కోసం ప్రత్యేక రక్షణ అవసరమని తెలంగాణ స్పష్టం చేసింది. గత మూడేళ్లుగా 66:34 నిష్పత్తిని అంగీకరించలేదని రమేశ్ బాబు తెలిపారు. ప్రస్తుత నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని కేటాయింపులు జరగాలని కోరారు. పోతిరెడ్డిపాడు నీటి విడుదలపై నియంత్రణ అవసరమని కూడా వాదించారు. పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో అన్ని అంశాలకు సమగ్ర పరిష్కారం కోరుతున్నట్లు తెలిపారు. ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి తెలంగాణ ప్రతిపాదనను సహేతుకంగా లేదని అభిప్రాయపడ్డారు. 66:34 నిష్పత్తి ప్రకారం రెండు రాష్ట్రాలకు నీటి విడుదలకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. వచ్చే ఆగస్టు వరకు ఏపీ తాగునీటి అవసరాల కోసం 104 టీఎంసీలు కావాలని వెల్లడించారు. తెలంగాణకు 200 టీఎంసీలు కోరడం సమంజసం కాదని పేర్కొన్నారు. తెలంగాణకు అవసరం లేకున్నా శ్రీశైలం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని ఆరోపించారు.

# కొండా సురేఖ స్థానంలో రాములమ్మ?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ కేబినెట్‌లో కొండా సురేఖ స్థానంలో కొత్త మంత్రిని నియమించే ప్రక్రియ వేగం పుంజుకున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న రెండు బెర్తులను కూడా ఒకేసారి భర్తీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ అంశంపై ఢిల్లీ పర్యటనలో పార్టీ పెద్దల నుంచి అవసరమైన గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలుస్తోంది. సురేఖ బర్తరఫ్ తర్వాత ఏర్పడిన ఖాళీని ఎక్కువకాలం కొనసాగించకుండా త్వరగా నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. గురువారం సాయంత్రం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను సీఎం కలిసినప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశంపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే భేటీలో ఏ నిర్ణయాలు తీసుకున్నారన్న పూర్తి వివరాలు బయటకు రాలేదు. అయినప్పటికీ త్వరలోనే కొత్త మంత్రుల ప్రమాణస్వీకారం జరిగే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ నిర్ణయంతో కేబినెట్‌లో సామాజిక సమీకరణాలు మారే అవకాశం ఉంది. ఖాళీల భర్తీ ద్వారా ప్రభుత్వ పనితీరుకు కొత్త ఊపు వస్తుందని నేతలు అంచనా వేస్తున్నారు. పార్టీ కార్యకర్తల్లో కూడా ఈ అంశంపై ఉత్కంఠ కనిపిస్తోంది. కొత్తగా కేబినెట్‌లోకి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేరు బలంగా వినిపిస్తోంది. ఆయన ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. మంత్రిగా అవకాశం వస్తే డిప్యూటీ సీఎం బాధ్యతలు కూడా అప్పగించే ఛాన్స్ ఉందన్న ప్రచారం కాంగ్రెస్‌లో ఉంది. మహేశ్ గౌడ్ ప్రభుత్వంలో చేరితే పీసీసీ అధ్యక్ష పదవిని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌కు అప్పగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరో బెర్త్ కోసం ఎమ్మెల్సీ విజయశాంతి పేరు పరిశీలనలో ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొండా సురేఖ స్థానంలో బీసీ మహిళగా విజయశాంతిని తీసుకోవాలనే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాల్లో ఆమె పెద్దగా కనిపించకపోయినా, కీలక బాధ్యత అప్పగిస్తే రాజకీయంగా మళ్లీ యాక్టివ్ అవుతారనే అభిప్రాయం ఉంది. ఈ నియామకాలు పార్టీ భవిష్యత్ వ్యూహాన్ని దృష్టిలో పెట్టుకుని జరగనున్నట్లు సమాచారం. ఈ ఎంపికపై తుది నిర్ణయం సీఎం విచక్షణకే వదిలినట్లు సమాచారం. పార్టీని



బలోపేతం చేసే నేతలకే ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం సూచించినట్లు తెలుస్తోంది. దీంతో మంత్రివర్గ కూర్పుపై చివరి నిమిషం వరకు ఆసక్తి కొనసాగనుంది. కేబినెట్ విస్తరణతోపాటు అసెంబ్లీలో కీలక పదవుల భర్తీపై కూడా సీఎం రేవంత్ రెడ్డి దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. డిప్యూటీ స్పీకర్ పదవికి రామచంద్ర నాయక్ పేరు గతంలో ప్రకటించినా, ఇప్పటివరకు ఆయన ఆ బాధ్యతలు చేపట్టలేదు. ప్రభుత్వ విప్‌గా ఉన్న రామచంద్ర నాయక్ మంత్రివర్గంలో చోటు కోసం ఎదురుచూస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ ఉంది. సీనియర్ ఎమ్మెల్యే బాలూనాయక్ కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరిలో ఒకరికి చీఫ్ విప్ పదవి, మరొకరికి డిప్యూటీ స్పీకర్ బాధ్యతలు ఇవ్వాలనే ఫార్ములాను సీఎం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇలా చేస్తే కేబినెట్‌లో అవకాశం దక్కని నేతలకు కూడా కీలక పదవులు ఇవ్వొచ్చని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వ్యవహారాలను సమర్థంగా నడిపించేందుకు ఈ కాంబినేషన్ ఉపయోగపడుతుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ ఫార్ములా అమలైతే అసెంబ్లీ నిర్వహణలో కూడా మార్పులు కనిపించే అవకాశం ఉంది. ఆశావహులకు పదవులు దక్కడం ద్వారా అసంతృప్తిని తగ్గించవచ్చని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. నేతల మధ్య సమన్వయం పెంచడం మరో లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్న గడ్డం ప్రసాద్ మంత్రివర్గంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరిగినా, తాజా ఢిల్లీ పర్యటనలో ఆయనకు సానుకూల సంకేతం రాలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో కొందరు మంత్రుల శాఖలను మార్చే అంశం కూడా చర్చలో ఉన్నట్లు సమాచారం. ఒకరిద్దరు మంత్రులను తప్పించే అవకాశాలపై వార్తలు వస్తున్నా, కాంగ్రెస్ పార్టీ లేదా ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. రాబోయే రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని శాఖల మార్పులు, కొత్త బాధ్యతల కేటాయింపులు జరగవచ్చనే అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయం పెంచేలా కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మంత్రివర్గ విస్తరణ కేవలం ఖాళీల భర్తీగా కాకుండా, తెలంగాణ కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయ వ్యూహంలో భాగంగా మారే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. శాఖల మార్పులు జరిగితే పనితీరుపై మరింత దృష్టి పెట్టేలా ప్రభుత్వం సంకేతం ఇచ్చినట్టవుతుంది. ఈ మార్పులు రాబోయే ఎన్నికల రాజకీయాలకు కూడా ఉపయోగపడతాయని నేతలు భావిస్తున్నారు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు జరుగుతుందన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రశ్నగా మారింది. సచివాలయ వర్గాల ప్రకారం శనివారం లేదా ఆదివారం విస్తరణ జరిగే అవకాశం ఉందన్న అంచనాలు ఉన్నాయి. అయితే గవర్నర్‌తో సీఎం భేటీలో జరిగిన చర్చల పూర్తి వివరాలు బయటకు రాకపోవడంతో తేదీపై స్పష్టత లేదు. కాంగ్రెస్ వర్గాలు మాత్రం విస్తరణ జరగడం దాదాపు ఖాయమని చెబుతున్నాయి. కొత్త మంత్రుల ఎంపికతో ప్రాంతీయ సమతుల్యత, సామాజిక సమీకరణాలు, పార్టీ పనితీరు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహేశ్ గౌడ్‌కు డిప్యూటీ సీఎం అవకాశం వస్తే ప్రభుత్వంలో ఆయన పాత్ర మరింత కీలకం కానుంది. విజయశాంతికి పదవి దక్కితే పార్టీ కార్యకలాపాల్లో ఆమెకు కొత్త బాధ్యతలు రావచ్చు. బలరాం నాయక్ పీసీసీ చీఫ్ అయితే సంస్థాగత మార్పులు వేగంగా జరిగే అవకాశం ఉంది. మొత్తంగా ఈ విస్తరణ రేవంత్ ప్రభుత్వంలో కొత్త రాజకీయ అధ్యాయానికి నాంది కావచ్చనే చర్చ సాగుతోంది. ఇప్పటి వరకు వినిపిస్తున్న పేర్లు తుది జాబితా కాదన్న అభిప్రాయం ఉంది. అధికారిక ప్రకటన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

# కొండా సురేఖకు మరో ఝలక్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

వరంగల్ ఈస్ట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖకు రేవంత్ సర్కార్ వరుస షాకులు ఇస్తోంది. నిన్ననే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన ప్రభుత్వం, గవర్నర్ ఆమోదం అనంతరం సచివాలయంలో ఆమెకు కేటాయించిన చాంబర్‌ను స్వాధీనం చేసుకుంది. నాలుగో అంతస్తులో ఉన్న సురేఖ కార్యాలయాన్ని సీఎంవో వర్గాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. మంత్రి పదవి కోల్పోయిన వెంటనే అధికారిక సౌకర్యాల తొలగింపు ప్రక్రియ వేగంగా సాగుతోంది. తాజాగా ఆమె భద్రతపై కూడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సురేఖకు కేటాయించిన గన్‌మెన్లను సంబంధిత అధికారులు వెనక్కి పిలిచారు. నిన్న సాయంత్రం వరకు మంత్రి హోదాలో ఉన్న ఆమెకు అందుబాటులో ఉన్న భద్రతను పూర్తిగా తొలగించినట్లు సమాచారం. దీంతో రాజకీయ వర్గాల్లో ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది. తాజా చర్యలపై సురేఖ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు పార్టీ అంతర్గత వర్గాల్లో కూడా చర్చకు కారణమయ్యాయి. అధికార మార్పిడి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సురేఖ అనుచరులు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నారు. భద్రత సిబ్బందిని వెనక్కి పిలవడంతో పాటు కొండా సురేఖకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంత్రి హోదా ముగిసిన నేపథ్యంలో ప్రోటోకాల్ ప్రకారం సౌకర్యాలు మార్చడం సాధారణ ప్రక్రియగా అధికార వర్గాలు భావిస్తున్నాయి. అయితే రాజకీయంగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న సమయంలో ఈ చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తనను అన్యాయంగా కేబినెట్ నుంచి తొలగించారని సురేఖ ఇప్పటికే మండిపడ్డారు. ఈ నిర్ణయాల తర్వాత ఆమె అసంతృప్తి మరింత పెరిగినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులు, మీడియాలో ప్రచారంలో ఉన్న కొన్ని వార్తలపై సురేఖ స్పందించారు. వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. అధికారిక ఖాతాల్లో వెల్లడించే సమాచారాన్నే నమ్మాలని మీడియా ప్రతినిధులు, అనుచరులు, ప్రజలకు సూచించారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని పరోక్షంగా కోరారు. దీంతో సురేఖకు రాజకీయంగా మరో పరీక్ష ఎదురైనట్టయింది. సురేఖ తన అధికారిక ఎక్స్ ఖాతాలో చేసిన ప్రకటనలో, సోషల్ మీడియాలో తన పేరుతో తిరుగుతున్న పోస్టుల విషయంలో స్పష్టత ఇచ్చారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కనిపించే సమాచారాన్నే ప్రామాణికంగా పరిగణించాలని ఆమె కోరారు. ఇందుకోసం అధికారిక ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ ఖాతాల వివరాలను కూడా పోస్టులో జోడించారు. ఇదే సమయంలో ఆమె పేరుతో ఉన్న ఓ ఫేస్‌బుక్ పోస్టు తీవ్ర కలకలం రేపింది. నిరీక్షణ ముగిసిందని, త్వరలో తన రాజకీయ భవిష్యత్తుపై బిగ్ అప్‌డేట్ ఇవ్వబోతున్నానని ఆ పోస్టులో పేర్కొన్నట్లు ప్రచారం జరిగింది. తెలంగాణ ప్రజలంతా తన ప్రకటన కోసం ఎదురుచూడాలని అందులో సందేశం కనిపించింది. ఈ పోస్టు క్షణాల్లో వైరల్ కావడంతో సురేఖ తదుపరి రాజకీయ అడుగు ఏమిటన్న చర్చ మొదలైంది. అయితే



ఆ ఖాతా తనది కాదని ఆమె తేల్చి చెప్పారు. దీంతో ఊహాగానాలకు తెరపడింది. ఆమె అభిమానులు అధికారిక ప్రకటన కోసం వేచి చూస్తున్నారు. కొండా సురేఖకు సంబంధించిన రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా ప్రచారంపై ఆమె ఇచ్చిన క్లారిటీ ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రివర్గం నుంచి తొలగింపు, సచివాలయ చాంబర్ స్వాధీనం, భద్రతా సిబ్బంది ఉపసంహరణ, బుల్లెట్ ప్రూఫ్ వాహనం వెనక్కి తీసుకోవడం వంటి వరుస పరిణామాలు ఆమె రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తిని పెంచుతున్నాయి. మరోవైపు, తన పేరుతో వెలువడుతున్న ప్రకటనలను ఆమె ఖండించడం చర్చకు దారి తీసింది. అధికారిక సోషల్ మీడియా వేదికల ద్వారా మాత్రమే తన అభిప్రాయాలను వెల్లడిస్తానన్న సంకేతాన్ని సురేఖ ఇచ్చారు. దీంతో ప్రస్తుతం వైరల్ అవుతున్న పోస్టుల ఆధారంగా ఎలాంటి నిర్ణయాలకు రావద్దని ఆమె సూచించినట్లైంది. రాబోయే రోజుల్లో సురేఖ రాజకీయంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతారా, ప్రత్యామ్నాయ రాజకీయ మార్గం ఎంచుకుంటారా అన్నదానిపై కూడా ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ అంశంపై కాంగ్రెస్ నాయకత్వం నుంచి తదుపరి స్పందన ఎలా ఉంటుందో చూడాలి. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో దీనిపై చర్చ జరుగుతోంది. ప్రస్తుతం కొండా సురేఖ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి పదవి కోల్పోయిన వెంటనే ప్రభుత్వ సౌకర్యాలు తగ్గడం, సోషల్ మీడియాలో తన పేరుతో వచ్చిన పోస్టుపై ఆమె స్వయంగా వివరణ ఇవ్వడం వరుసగా చోటుచేసుకున్నాయి. ఈ పరిణామాల మధ్య సురేఖ రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత ఎప్పుడు ఇస్తారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతం తన అధికారిక ఖాతాల్లో లేని సమాచారాన్ని నమ్మవద్దని ఆమె చేసిన హెచ్చరిక కీలకంగా మారింది. ఫేస్‌బుక్‌లో వైరల్ అయిన బిగ్ అప్‌డేట్ పోస్టు తనది కాదని ఆమె చెప్పడంతో, ఆ ప్రచారానికి అధికారిక ధృవీకరణ లేదన్న విషయం స్పష్టమైంది. మరోవైపు ప్రభుత్వ నిర్ణయాలపై సురేఖ స్పందన ఎలా ఉంటుందన్నది ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజా పరిణామాలు ఆమె రాజకీయ ప్రయాణంలో కీలక మలుపుగా మారే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. తదుపరి ప్రకటనపై ఇప్పుడు అందరి దృష్టి ఉంది. రాజకీయ వర్గాలు ఆమె తదుపరి అడుగును అంచనా వేసేందుకు ప్రయత్నిస్తున్నాయి.

# నాణ్యతలో రాజీ వద్దు

**మొదటిపేజీ తరువాయి**

నారాయణపేట జిల్లా మద్దూరు పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. శుక్రవారం మద్దూరుకు చేరుకున్న ఆయన సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా పాఠశాల నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన సీఎం, అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ ప్రణాళికలు, డిజైన్లు, లేఅవుట్‌లను పరిశీలించి అవసరమైన మార్పులపై అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు అందేలా భవన నిర్మాణంలో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిగణించాలని స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రాంగణ రూపకల్పన చేయాలని సూచించారు. పనుల్లో వేగం పెంచడంతోపాటు నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రతిపాదించిన పనుల కాలపట్టికను క్రమం తప్పకుండా సమీక్షించాలని చెప్పారు. ప్రతి దశలో పురోగతిని నమోదు చేసి, ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా వసతి, భోజన, క్రీడా సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్దూరులో నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలకు సంబంధించిన భూమి విషయంలో స్థానిక రైతుల సేవను సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా గుర్తించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొందరు రైతులు డబ్బుతో భూమిని కొనుగోలు చేసి, అనంతరం ప్రభుత్వానికి అప్పగించారు. ప్రస్తుతం అదే స్థలంలో ప్రభుత్వం పాఠశాల నిర్మాణాన్ని చేపట్టింది. పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగిన ముఖ్యమంత్రి, నిర్మాణ పనుల స్థితిగతులను అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూములు ఇచ్చిన రైతులను గుర్తించి వారితో స్వయంగా మాట్లాడారు. రైతుల కుటుంబాల పరిస్థితులను అడిగి తెలుసుకున్న ఆయన, వారికి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు సమకూర్చిన రైతుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజల సమస్యలను కూడా సీఎం శ్రద్ధగా విన్నారు. పలువురు తమ సమస్యలపై విజ్ఞాపనలు సమర్పించగా, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతుల సహకారాన్ని సీఎం అభినందించారు. వారి కుటుంబాలకు పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మద్దూరులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన పనులపై కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్షించారు. నిర్దేశిత గడువులోగా కళాశాల భవనాన్ని పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన సీఎం, పనుల పురోగతిని గమనించారు. కళాశాల డిజైన్లు, లేఅవుట్‌ను పరిశీలించి అవసరమైన మార్పులను సూచించారు. విద్యార్థుల సంఖ్య భవిష్యత్తులో పెరిగే అవకాశాలను పరిగణనలోకి తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. తరగతి గదులు, ఇతర విద్యా సదుపాయాలు సౌకర్యవంతంగా ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రాంగణ భద్రతకు అవసరమైన చర్యలు ముందుగానే చేపట్టాలని చెప్పారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని సీఎం స్పష్టం చేశారు. ఉపయోగించే నిర్మాణ సామగ్రి ప్రమాణాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. పనుల పర్యవేక్షణను నిరంతరం కొనసాగించాలని చెప్పారు. పనులు పూర్తయ్యే



వరకు అధికారులు శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. మద్దూరు పర్యటనలో ముఖ్యమంత్రి స్థానిక ప్రజలతో కూడా ఆత్మీయంగా మమేకమయ్యారు. నిర్మాణ ప్రాంతాల్లో పర్యటిస్తున్న సమయంలో అక్కడ ఉన్న ప్రజలను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు స్థానికులు తమ అవసరాలు, సమస్యలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరించిన రేవంత్‌రెడ్డి, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు స్పందించాలని సూచించారు. అభివృద్ధి పనులు కేవలం భవనాల నిర్మాణానికే పరిమితం కాకుండా, ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా ఉండాలని ఆయన పేర్కొన్నారు. విద్యాసంస్థల నిర్మాణంలో విద్యార్థుల సౌకర్యం, భద్రత, భవిష్యత్ విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పాఠశాల, కళాశాల ప్రాంగణాల్లో అవసరమైన మౌలిక వసతులను ముందుగానే గుర్తించి అందుకు అనుగుణంగా పనులు చేపట్టాలని అధికారులకు చెప్పారు. ప్రజల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. స్థానికులతో కరచాలనం చేస్తూ సీఎం వారి అభిప్రాయాలను కూడా తెలుసుకున్నారు. పర్యటన సందర్భంగా అధికారులు సమగ్ర వివరాలను ముఖ్యమంత్రికి అందించారు. సమస్యల పరిష్కారానికి సమయపాలన పాటించాలని తెలిపారు. త్వరగా పనులు పూర్తిచేయాలని కూడా సీఎం సూచించారు. మద్దూరులో విద్యా మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఈ నిర్మాణాలు కీలకంగా మారనున్నాయి. సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల పూర్తయితే విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం పూర్తయితే స్థానిక యువతకు ఉన్నత విద్య అవకాశాలు మరింత చేరువ కానున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయడంతోపాటు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. భవిష్యత్ అవసరాలను అంచనా వేసి ప్రణాళికలు రూపొందించడం ద్వారా ప్రజాధనాన్ని సమర్థంగా వినియోగించవచ్చని పేర్కొన్నారు. రైతులు ప్రజా ప్రయోజనం కోసం భూమిని సమకూర్చిన అంశాన్ని ప్రభుత్వం గుర్తించి వారి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు దిశగా చర్యలు చేపట్టనుంది. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు వేగంగా స్పందించాలని సీఎం ఆదేశించారు. మద్దూరు పర్యటనలో విద్యాసంస్థల పనులు, రైతుల సేవ, ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రి చూపిన శ్రద్ధకు ప్రాధాన్యం ఏర్పడింది. గడువులోగా పనులు పూర్తి చేస్తే విద్యా అభివృద్ధికి మరింత బలం చేకూరనుంది.

# 33 నెలలు.. రూ.66 వేల బాకీ

**మొదటిపేజీ తరువాయి**

బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామస్థాయిలో వివరించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హరీశ్ రావు లెక్కల ప్రకారం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి అవ్వాతాతకు రూ.66,000 బాకీ పడిందని ఆరోపించారు. నెలకు రూ.2,000 పెన్షన్ పెంపు లెక్కను ప్రస్తావిస్తూ, 33 నెలలుగా అదనంగా రావాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించలేదన్నారు. కేసీఆర్ హయాంలో 42 లక్షల మంది పేదలకు గౌరవప్రదంగా నెలనెలా పెన్షన్ అందేదని గుర్తుచేశారు. ప్రస్తుతం కొత్త లబ్ధిదారులకు పెన్షన్లు మంజూరు చేయడం లేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం మొదటి నెలలోనే రూ.4,000 పెన్షన్ అమలు చేసిందని ప్రస్తావించిన ఆయన, రేవంత్ రెడ్డి ఎందుకు అదే నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎన్నికలకు దగ్గరగా పెన్షన్ పెంచితే ప్రజలు మర్చిపోతారని ప్రభుత్వం భావిస్తోందని ఆరోపించారు. అయితే తెలంగాణ ఓటర్లు తెలివైనవారని, ఎన్నికల ముందు హామీ అమలు చేసినా పాత బకాయిల లెక్క అడుగుతారని అన్నారు.



పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు తక్షణమే స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సామాజిక భద్రత విషయంలో ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిలిపివేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. రైతుబంధు పథకం బలహీనపడిందని, రైతుబీమా అమలు సక్రమంగా లేదని విమర్శించారు. కేసీఆర్ కిట్, గొర్రెల పంపిణీ, చేప పిల్లల పథకాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీసీ బంధు, దళితబంధు వంటి పథకాలు కూడా కనిపించడం లేదని పేర్కొన్నారు. ఈ నిర్ణయాల వెనుక కమీషన్ల రాజకీయమే కారణమని ఆయన ఆరోపించారు. దేవుళ్లపై ప్రమాణాలు చేసి రైతులకు రుణమాఫీ హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు. రైతుల సమస్యలు పరిష్కరించకుండా మాటలతో కాలం గడుపుతోందని విమర్శించారు. పేదల సంక్షేమం ఆగిపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలను రాజకీయ కక్షలతో నిలిపివేయడం సరికాదన్నారు. రైతులు, మహిళలు, బీసీలు, దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమంపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రేవంత్ రెడ్డి పాలనపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. పాలన అంటే బూతులు మాట్లాడటం, ప్రభుత్వ భూములు అమ్ముకోవడం కాదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగంగా సాగాల్సిన సమయంలో భూముల వివాదాలు, ఆరోపణలు, రాజకీయ విమర్శలే ఎక్కువగా వినిపిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చెప్పుకోదగిన ఫలితాలు లేవని విమర్శించారు. సంక్షేమం, రైతుల ఆదాయం, ఉద్యోగాలు, సామాజిక భద్రత వంటి అంశాల్లో ప్రభుత్వం వెనుకబడిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు గడువులు మార్చడం ప్రజలను మభ్యపెట్టడమేనని ఆరోపించారు. హామీల అమలుపై ప్రతి కుటుంబం ప్రభుత్వం నుంచి జవాబు కోరాలని చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రచారం కంటే తమ జీవితాల్లో మార్పే ప్రజలకు ముఖ్యమని చెప్పారు. యువత, రైతులు, ఉద్యోగులు ప్రభుత్వ పనితీరును ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ప్రజలు నిర్ణయం తీసుకునే ముందు గత వెయ్యి రోజుల పాలనను పరిశీలించాలని కోరారు. కాంగ్రెస్ వైఫల్యాలను గ్రామస్థాయిలో వివరించాలని కార్యకర్తలకు సూచించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో రాజకీయంగా కాంగ్రెస్ విజయం సాధించినా, నైతిక విజయం బీఆర్ఎస్‌దేనని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ప్రజలు తమ పార్టీ వైపే ఉన్నారని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. వచ్చే రెండేళ్లు కష్టపడి పనిచేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

# కాంగ్రెస్ హామీలను నెరవేర్చాలి

- అటకెక్కిన 6 గ్యారంటీలు మహిళలను మోసం చేసిన కాంగ్రెస్
- కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ తుంగలో తొక్కిన కాంగ్రెస్
- మహిళలకు భద్రత కల్పించని కాంగ్రెస్



**భద్రాచలం : విశాల భారతి;** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ నాయకులు ఎండి ముంతాజ్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విస్తృత ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు ప్రజల ముందు పెట్టి గెలిచారని గెలిచినంక వాడ దాటేదాకా వాడ మల్లయ్య వాడ దాటినాక బోడి మల్లయ్య అనే చందం గా చేశారని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలమయ్యారని ఆమె విమర్శించారు. మహిళలకు 6 గ్యారంటీలు ఏ ఒక్కటి కూడా అమలుపరచట లేదని మాటలతో పూట గడుపుకుంటున్నారని ఆమె ఎద్దేవా చేశారు. కళ్యాణ్ షాది ముబారక్ వంటి పథకాలను తుంగలో తొక్కారని మహిళలకు మొండి చేయి చూపిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛను పెంచలేదని కేసీఆర్ అందించిన పింఛనే ఇస్తున్నారని ఎన్నికల హామీని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆమె అన్నారు. మహిళలు గమనిస్తున్నారని ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం పై ప్రజలు ప్రేమ చూపిస్తున్నారని ఈసారి ఎన్నికల్లో విఆర్ఎస్ గులాబీ జెండా తెలంగాణలో ఎగురుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కెసిఆర్ ప్రభుత్వమే సురక్షితమైన పాలన అందించిందని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు సేవ చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మహిళా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై కేసు దర్యాప్తు స్పీడప్

**విశాల భారతి, హల్ద్వానీ:** ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ర్యాలీ అనంతరం చోటుచేసుకున్న 'శుద్ధీకరణ' వివాదంలో, రాహుల్ గాంధీపై నమోదైన కేసులో దర్యాప్తు వేగంగా సాగుతోందని నైనిటాల్ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన పత్రాలు, అందులోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, త్వరలోనే సమగ్ర నివేదికను వెల్లడిస్తామని జిల్లా పోలీసులు వెల్లడించారు. కాగా, 2027 ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8న కాంగ్రెస్ నిర్వహించిన బహిరంగ సభలో మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్నారు. సభ ముగిసిన రెండు రోజుల తర్వాత (ఆగస్టు 10) శ్రీరామ్ సేన ధర్మార్థ సేవాన్యాస్ అనే రైట్ వింగ్ సంస్థ సభ్యులు అదే మైదానంలో 'శుద్ధీకరణ యజ్ఞం' నిర్వహించారు. అయితే, మైదానాన్ని శుద్ధి చేయడం వెనుక బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల కుల వివక్ష మనస్తత్వం ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు. శుద్ధీకరణ ఘటనపై ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ నిరోధక) చట్టం కింద వెంటనే కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలపై వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన అమిత్ కుమార్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు తమ ఎస్సీ వర్గం భావోద్వేగాలను, సెంటిమెంట్లను దెబ్బతీసేలా ఉన్నాయని, సాధారణ పారిశుధ్య కార్యక్రమానికి కుల రంగు పులిమారని ఆరోపించారు. కుల విద్వేషం రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని పేర్కొనడంతో, ఆగస్టు 30న రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదైంది.

**సెప్టెంబర్ 7న కాంగ్రెస్ భారీ మార్చ్**

శుద్ధీకరణ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేసేందుకు సిద్ధమైంది. సెప్టెంబర్ 7న డెహ్రాడూన్‌లోని పరేడ్ గ్రౌండ్ నుంచి సీఎం పుష్కర్ సింగ్ ధామీ అధికారిక నివాసం వరకు భారీ ప్రదర్శన, మార్చ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. రామ్‌లీలా మైదానంలో నిజంగా శుద్ధీకరణ నిర్వహించి దళిత వర్గాన్ని అవమానించిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ అస్పృశ్యత చర్యను సమర్థిస్తూ మాట్లాడిన ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

# నిమ్స్ లో వైద్య చికిత్సకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ ఎల్వోసీ అందజేత



**విశాల భారతి,ఇందూరు :** నియోజకవర్గంలో పేదవారికి నిమ్స్ లో చికిత్స పొందేందుకు ఎల్వోసీ అందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎల్వోసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన వారికి ఎల్ఓసి ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. నగరంలోని వర్ని రోడ్ కు చెందిన సుధీర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారన్నారు. దీంతో నిమ్స్ లో చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్వోసీ వారి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడటమే తన లక్ష్యమన్నారు. అలాగే హైదరాబాదులోని బీ బీ నగర్ ఎయిమ్స్ లో అత్యాధునిక సేవలు అందుబాటు వచ్చాయన్నారు. పేదలు దీర్ఘకాలిక వైద్య సమస్యలు ఉన్నవారు, అత్యవసర శస్త్రసికిత్సలు అవసరమైన వారు ఎయిమ్స్ కి వెళ్లాలని సూచించారు.

# ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనం ఇవ్వాలి

- హమ్‌రాధ ఉప సర్పంచ్ నిర్మల వడ్డెన్న అరుణ్




**విశాల భారతి, మాక్లూర్ :** ప్రజాస్వామ్యంలో ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రతి ప్రజాప్రతినిధికి గౌరవ వేతనం అందించాలని హమ్‌రాధ గ్రామ ఉప సర్పంచ్ నిర్మల వడ్డెన్న అరుణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు నిరంతరం ప్రజల మధ్య పనిచేస్తున్నారని తెలిపారు. వారి సేవలను ప్రభుత్వం గుర్తించి తగిన గౌరవ వేతనం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉప సర్పంచ్‌లకు నెలకు రూ.5,000, వార్డు సభ్యులకు నెలకు రూ.3,000 గౌరవ వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గౌరవ వేతనం అందించడం ద్వారా ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని నిర్మల వడ్డెన్న అరుణ్ పేర్కొన్నారు.

# కేశాపూర్‌లో 227 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తి

- ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేత



**విశాల భారతి, నిజామాబాద్ :** నిజామాబాద్ మండలంలోని కేశాపూర్ గ్రామంలో మంజూరైన 227 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని 100 శాతం పూర్తి చేసినట్లు గ్రామ సెక్రెటరీ దీపిక తెలిపారు. గ్రామంలోని రేషన్ లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఇంటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసినట్లు పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ కార్డులు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ గంగాధర్, ఉప సర్పంచ్ రానా ప్రతాప్, రేషన్ డీలర్ మమత, గ్రామ సిబ్బంది సహకారంతో పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు దీపిక వెల్లడించారు. గ్రామ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# నేనూ సీఎం అవుతా!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత చేసిన తాజా వ్యాఖ్యలు కొత్త చర్చకు దారి తీశాయి. హైదరాబాద్‌లో తెలంగాణ ఇంటర్ విద్య జేఏసీ నిర్వహించిన సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్ సదస్సులో పాల్గొన్న కవిత, తన రాజకీయ లక్ష్యాన్ని స్పష్టంగా చెప్పారు. తాను తెలంగాణ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నానని బహిరంగంగా వెల్లడించారు. సీఎం పదవి అంటే కేవలం అధికారం కాదని, ఆ పదవికి గౌరవం, హుందాతనం అవసరమని అన్నారు. ఈ వ్యాఖ్యలతో కవిత భవిష్యత్ రాజకీయ ప్రణాళికపై ఊహాగానాలు మొదలయ్యాయి. బీఆర్ఎస్‌లో కుటుంబ రాజకీయాలు, నాయకత్వంపై చర్చలు కొనసాగుతున్న సమయంలో కవిత నేరుగా సీఎం లక్ష్యాన్ని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో ఆమె వ్యాఖ్యలు పార్టీ లోపల, బయట రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా యువతకు అర్థమయ్యే భాషలో తన రాజకీయ ఆశయాన్ని చెప్పడం ప్రత్యేకంగా కనిపించింది. ఈ ప్రకటన తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు సంకేతమా అనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. తన రాజకీయ ప్రత్యర్థులపై కవిత చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపాయి. మాజీ మంత్రి హరీశ్‌రావు భార్య తనపై ఎన్నికల్లో పోటీ చేస్తే స్వాగతిస్తానని ఆమె సవాల్ చేశారు. గతంలో హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన విషయాన్ని గుర్తుచేసుకున్న కవిత, ఇప్పుడు ఆయన భార్య బరిలోకి వచ్చినా తాను సిద్ధమేనని స్పష్టం చేశారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనే ధైర్యం ఉందని చెప్పారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనను కవిత తీవ్రంగా



విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాలకు సీఎం ప్రకటనలకు మధ్య పొంతన లేదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి చర్యలను తుగ్లక్ చర్యలు అని చెప్పాల్సిన అవసరం లేదని, రేవంత్‌రెడ్డిలా ఉన్నావ్ అంటే సరిపోతుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సీఎం పదవికి ఉండాల్సిన గౌరవం కాపాడాలని సూచించారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య రాజకీయ వేడిని పెంచే అవకాశం కనిపిస్తోంది. ఈ సవాల్‌కు హరీశ్‌రావు కుటుంబం స్పందనపై ఆసక్తి నెలకొంది. రాబోయే ఎన్నికలపై ప్రభావం ఉంటుందా అన్న చర్చ మొదలైంది. ఇంటర్మీడియట్ విద్యపై కవిత చేసిన డిమాండ్లు కూడా రాజకీయంగా ప్రాధాన్యం పొందాయి. తెలంగాణలో ఇంటర్ విద్యను ఎత్తివేసే ఆలోచన ఉంటే ప్రభుత్వం వెంటనే వెనక్కి తగ్గాలని ఆమె కోరారు. ఇంటర్ విద్యను రద్దు చేయబోమని అసెంబ్లీ సాక్షిగా రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటర్ వ్యవస్థ మారితే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇంటర్ విద్య బలమైన వ్యవస్థగా ఉందని, దానిని మార్చాల్సిన అవసరం లేదని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలను ప్రభుత్వం తేలికగా తీసుకుంటే ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుందని హెచ్చరించారు. యువత భవిష్యత్‌పై ప్రభావం చూపే నిర్ణయాలను రాజకీయ ప్రయోజనాల కంటే విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థుల్లో అనుమానాలు తొలగించేందుకు స్పష్టమైన ప్రకటన అవసరం. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశంలో ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. విద్యా రంగంపై గతంలో ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి నేతృత్వంలోని కమిషన్‌ను కూడా కవిత ప్రశ్నించారు. ఆ కమిషన్‌కు మూడు సంవత్సరాల సమయం ఇచ్చినా, చివరకు దాని సిఫార్సులను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇంటర్‌లో పాస్ శాతం 45కి పెంచాలన్న సిఫార్సుపైనా ఆమె సందేహాలు వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఓట్ల శాతాన్ని ప్రస్తావిస్తూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు మరో కమిషన్ గురించి ప్రభుత్వం మాట్లాడుతోందని, దాని నివేదిక ఎప్పుడు వస్తుంది, ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. కవిత విమర్శల వెనుక విద్యా విధానంపై రాజకీయ పోరాటం కనిపిస్తోంది. గత నిర్ణయాలు, కొత్త ప్రతిపాదనలు రెండింటిపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు ఇవ్వాలని ఆమె కోరుతున్నారు. విద్యార్థుల సమస్యలు కేవలం రాజకీయ నినాదాలుగా మారకుండా, అమలు చేయగల విధానాలు రావాలని ఆమె చెబుతున్నారు. దీనిపై విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల స్పందన కీలకంగా మారవచ్చు. కమిషన్ సిఫార్సులపై ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని కవిత కోరారు. తెలంగాణకు ఏటా సుమారు రెండు లక్షల కోట్ల రూపాయల ఆదాయం వస్తోందని కవిత పేర్కొన్నారు. అందులో లక్ష కోట్ల రూపాయలను విద్య, వైద్య రంగాలకు కేటాయిస్తే ప్రజలకు ఉచితంగా మెరుగైన సేవలు అందించవచ్చని అన్నారు. దీనికి ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం అవసరమని వ్యాఖ్యానించారు. మరోవైపు కవిత చేసిన సీఎం వ్యాఖ్యలపై మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో ఆలోచించాలంటూ కవితపై విమర్శలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మొత్తంగా కవిత తాజా వ్యాఖ్యలు మూడు అంశాలను ముందుకు తెచ్చాయి. సీఎం కావాలన్న ఆకాంక్ష, హరీశ్‌రావు కుటుంబానికి విసిరిన సవాల్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు ఇప్పుడు తెలంగాణ రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి. బీఆర్ఎస్ భవిష్యత్ నాయకత్వంలో కవిత పాత్ర ఎంతవరకు పెరుగుతుందో చూడాలి. ఆమె వ్యాఖ్యలు వ్యక్తిగత రాజకీయ లక్ష్యమా, పెద్ద వ్యూహంలో భాగమా అనేది కాలమే స్పష్టం చేయాలి. ప్రస్తుతం మాత్రం తెలంగాణలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది.

## కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

- లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసానికి పిలుపు

**విశాల భారతి, రామాయంపేట :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వేదిక నుంచి ఆహ్వానం అందింది. యూరప్‌లో స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్, పెట్టుబడుల రంగాలకు సంబంధించిన ప్రముఖ కార్యక్రమం లక్సెంబర్గ్ వెంచర్ డేస్2026లో కీలకోపన్యాసం చేయాలని నిర్వాహకులు కేటీఆర్‌ను ఆహ్వానించారు. స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి, ఆవిష్కరణలు, పెట్టుబడుల ప్రోత్సాహం, సాంకేతిక రంగంలో మారుతున్న అవకాశాలపై జరిగే ఈ అంతర్జాతీయ వేదికలో ప్రపంచవ్యాప్తంగా వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు, స్టార్టప్ ప్రతినిధులు పాల్గొననున్నారు. తెలంగాణలో ఐటీ, స్టార్టప్, ఇన్నోవేషన్ రంగాల అభివృద్ధిలో కేటీఆర్ పోషించిన పాత్రను గుర్తిస్తూ ఈ ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ వేదికపై తెలంగాణలో అమలు చేసిన స్టార్టప్ విధానాలు, పెట్టుబడుల ఆకర్షణ, సాంకేతిక రంగ అభివృద్ధికి సంబంధించిన అనుభవాలను కేటీఆర్ పంచుకునే అవకాశం ఉంది. లక్సెంబర్గ్ వెంచర్ డేస్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో కీలకోపన్యాసానికి ఆహ్వానం రావడం కేటీఆర్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరో గుర్తింపుగా బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# వెయ్యి రోజులు.. అన్నీ గొడవలే..!

**మొదటిపేజీ తరువాయి**

మారిన తర్వాత పరిణామాలు వేగంగా జరిగాయి. సుష్మిత చేసిన తీవ్ర వ్యాఖ్యలు పార్టీ క్రమశిక్షణ వ్యవహారంగా మారాయి. చివరకు సురేఖ మంత్రి పదవిని కోల్పోయారు. అయితే అక్కడితో వివాదం ముగియలేదు. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబంపై సుష్మిత చేసిన ఆరోపణలు మరోసారి రాజకీయ దుమారం రేపాయి. ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయా, వాటి వెనుక అసలు కారణం ఏంటి అనేది వేరే విషయం. కానీ అధికార పార్టీలో కీలకంగా ఉన్న నేత కుటుంబం నుంచి ముఖ్యమంత్రిపై విమర్శలు రావడం కాంగ్రెస్ ఇమేజ్‌కు ఇబ్బందికరమే. వెయ్యి రోజుల విజయోత్సవ సందేశం వెళ్లాల్సిన సమయంలో ఈ ఎపిసోడ్ మీడియా ఫోకస్‌ను పూర్తిగా మార్చేసింది. దీంతో ప్రభుత్వ ప్రచారానికి రాజకీయ వివాదం పెద్ద అడ్డంకిగా మారింది. ఈ ప్రభావం వచ్చే రోజుల్లో మరింత స్పష్టంగా కనిపించవచ్చు. సురేఖ ఎపిసోడ్ తర్వాత కూడా కాంగ్రెస్‌లో చర్యలు కొనసాగాయి. సీనియర్ నేత జి. చిన్నారెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించడం చర్చకు వచ్చింది. మరోవైపు ఎల్‌బీ నగర్‌కు చెందిన కాంగ్రెస్ నేత జక్కిడి ప్రభాకర్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. పార్టీ క్రమశిక్షణను కాపాడటానికి నాయకత్వం కఠినంగా వ్యవహరిస్తోందనే సంకేతం దీనివల్ల వెళ్లింది. కానీ అసలు ప్రశ్న వేరుగా ఉంది. పార్టీ లోపల అసంతృప్తి ఎందుకు పదేపదే బయటకు వస్తోంది? నేతల మధ్య సమన్వయం ఎందుకు కుదరడం లేదు? ఇలాంటి ప్రశ్నలు ఇప్పుడు కార్యకర్తల్లో కూడా చర్చకు వస్తున్నాయి. ఇదే సమయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పరిస్థితిని మరింత వేడెక్కించాయి. తనకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వస్తే ఎవరూ అడ్డుకోలేరన్న భావనలో ఆయన మాట్లాడటం భవిష్యత్ నాయకత్వంపై చర్చకు




దారి తీసింది. పాత కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్ మధ్య తేడాలపై ఆయన వ్యాఖ్యలు కూడా పార్టీ అంతర్గత సమీకరణాలను గుర్తుచేశాయి. ఇక 22A భూముల వివాదం ప్రభుత్వానికి మరో సవాలుగా మారింది. కొన్ని భూములు నిషేధిత జాబితాలో చేరడంతో అసలు యజమానులు రిజిస్ట్రేషన్, లావాదేవీల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఫిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వం సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని చెబుతున్నా, ప్రజలకు ఫలితం కనిపించే వరకు ఈ అంశం రాజకీయంగా వేడి తగ్గించేలా కనిపించడం లేదు. బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే దీనిని ప్రభుత్వంపై విమర్శలకు ఉపయోగిస్తున్నాయి. రాజకీయ పార్టీలు ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలను పట్టుకుంటే వాటికి సహజంగానే ఎక్కువ స్పందన వస్తుంది. అందుకే కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో చేసిన అభివృద్ధిని ప్రచారం చేయాలనుకుంటున్నా, భూములు, ఉద్యోగాలు, సంక్షేమం, పరిపాలన వంటి అంశాలపై ప్రజల అనుభవమే అసలు ప్రమాణంగా మారుతుంది. సోషల్ మీడియా కాలంలో ఒక వివాదం వేగంగా వైరల్ కావడం వల్ల ప్రభుత్వ విజయాల ప్రచారం కూడా వెంటనే వెనుకబడే అవకాశం ఉంటుంది. ఇది నాయకత్వం గుర్తించాల్సిన కీలక విషయం. ఇలాంటి సమయంలో నాయకత్వం ప్రతి నిర్ణయాన్ని జాగ్రత్తగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. మొత్తంగా చూస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వెయ్యి రోజుల మైలురాయి ఒక మంచి రాజకీయ అవకాశం. కానీ ఆ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలంటే ముందుగా పార్టీ అంతర్గత విభేదాలను కంట్రోల్ చేయాలి. సురేఖ ఉద్వాసన, సుష్మిత ఆరోపణలు, చిన్నారెడ్డి తొలగింపు, జక్కిడి సస్పెన్షన్, రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు, 22A భూముల వివాదం కలిసి కాంగ్రెస్‌పై ఒత్తిడి పెంచుతున్నాయి. ప్రజలకు సింపుల్‌గా చెప్పాలంటే, ప్రభుత్వం తన రిపోర్ట్ కార్డ్ చూపించాలనుకుంటున్న సమయంలో పార్టీ గొడవలే హెడ్‌లైన్స్ అవుతున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ముందున్న అసలు టాస్క్ ఒక్కటే: పాలనను రాజకీయ వివాదాల నుంచి బయటకు తీసుకురావడం. చేసిన పనులకు స్పష్టమైన లెక్క ఇవ్వాలి, తప్పులు ఉంటే త్వరగా సరిచేయాలి, నేతల మధ్య కోఆర్డినేషన్ పెంచాలి. వెయ్యి రోజుల తర్వాత మిగిలిన కాలం మరింత కీలకం. ఎందుకంటే ప్రజలు చివరికి ఎవరు ఏం మాట్లాడారన్నదానికంటే తమ జీవితాల్లో ఏం మారిందోనే చూస్తారు. ఆ మార్పును చూపించగలిగితేనే వెయ్యి రోజుల పాలనకు నిజమైన రాజకీయ విలువ దక్కుతుంది.

# ఒవైసీలకు దేశభక్తి సర్టిఫికెటా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత వ్యాఖ్యల వేడి కొనసాగుతున్న సమయంలో మరో వివాదం తెరపైకి వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీలను దేశభక్తులుగా అభివర్ణించడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తీవ్రంగా స్పందించారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం మజ్లిస్ నేతలను ఈ స్థాయిలో ప్రశంసించడం ఆశ్చర్యంగా ఉందని విమర్శించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు దేశభక్తి ఉందని రేవంత్ అంగీకరించడం సంతోషకరమేనని చెప్పారు. అయితే అదే సందర్భంలో ఒవైసీ సోదరులను వారితో పోల్చడం సరైన నిర్ణయం కాదని రామచందర్ రావు అన్నారు. ఈ వ్యాఖ్యలపై తెలంగాణలో రాజకీయ చర్చ తీవ్రంగా సాగుతోంది. సోషల్ మీడియాలో కూడా ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి చెప్పిన దేశభక్తి నిర్వచనం ఏంటనే ప్రశ్న ఇప్పుడు బీజేపీ నుంచి గట్టిగా వినిపిస్తోంది. రాజకీయంగా ఈ వివాదం రాబోయే రోజుల్లో మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. అసెంబ్లీలో వందేమాతరం గేయం పాడిన సమయంలో మజ్లిస్ ఎమ్మెల్యేలు నిలబడలేదని రామచందర్ రావు ఆరోపించారు. జాతీయ గేయం, జాతీయ జెండాకు గౌరవం ఇవ్వడం దేశభక్తికి ప్రాథమిక గుర్తులని ఆయన పేర్కొన్నారు. అలాంటి సందర్భంలో గౌరవం చూపని నాయకులకు సీఎం దేశభక్తి సర్టిఫికెట్లు ఇవ్వడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో ఒవైసీ సోదరులను రేవంత్ ప్రశంసించిన మాటలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాజకీయ మిత్రపక్షాన్ని సంతోష పెట్టేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రజలకు నచ్చదని హెచ్చరించారు. ముందు అసెంబ్లీలో



మజ్లిస్ సభ్యులు వందేమాతరం పాడుతున్నప్పుడు గౌరవంగా నిలబడాలని సూచించారు. తర్వాతే దేశభక్తిపై చర్చ చేయాలని అన్నారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన రాజకీయ అవసరాల కోసం మజ్లిస్‌తో సన్నిహితంగా వ్యవహరిస్తోందని బీజేపీ విమర్శిస్తోంది. మరోవైపు కాంగ్రెస్ వర్గాలు మాత్రం రేవంత్ వ్యాఖ్యలను రాజకీయ సందర్భంలో చూడాలని చెబుతున్నాయి. ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ఈ వివాదాన్ని బీజేపీ పెద్దదిగా చేస్తోందని అధికార పార్టీ నేతలు అంటున్నారు. దీంతో విమర్శలు ప్రతివిమర్శలు మరింత పెరుగుతున్నాయి. రామచందర్ రావు తన విమర్శల్లో గతంలో ఒవైసీ సోదరులు చేసిన కొన్ని వ్యాఖ్యలను కూడా ప్రస్తావించారు. పోలీసులను పదిహేను నిమిషాలు పక్కకు పంపితే తమ తడాఖా చూపిస్తామని గతంలో చేసిన వ్యాఖ్యలను సీఎం మర్చిపోయారా అని ప్రశ్నించారు. గోమాంసంపై ఒవైసీ సోదరులు చేసిన వ్యాఖ్యలను కూడా ప్రస్తావిస్తూ, అలాంటి మాటలు మాట్లాడిన వారిని దేశభక్తులుగా ఎలా అభివర్ణిస్తారని నిలదీశారు. అయితే ఆరోపణల పూర్తి సందర్భం ప్రజలకు స్పష్టంగా తెలియాలి. లేకపోతే సోషల్ మీడియా క్లిప్పుల ఆధారంగా అభిప్రాయాలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుత వివాదంలో కూడా ఇదే అంశం కీలకంగా మారింది. యువత సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చిన్న వీడియోలను చూసి వెంటనే నిర్ణయానికి రాకుండా పూర్తి ప్రసంగం తెలుసుకోవడం అవసరం. దేశభక్తి అంటే జాతీయ చిహ్నాలకు గౌరవం మాత్రమేనా, లేక రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య బాధ్యతలు, దేశ ప్రయోజనాల కోసం పనిచేయడమా అనే చర్చ కూడా ఇక్కడ మొదలవుతోంది. రాజకీయ పార్టీలు తమ విధానాలతో సమాధానం చెప్పాలి. ప్రజలు కూడా విమర్శలను పరిశీలించాలి. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని దేశభక్తి అంటే ఏమిటో స్పష్టంగా చెప్పాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మిత్రపక్షమైన మజ్లిస్‌పై ముఖ్యమంత్రి చూపుతున్న అభిమానం వెనుక ఓటు బ్యాంక్ లెక్కలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. పార్టీల మధ్య వ్యూహాత్మక సంబంధాలు సహజమే. అయితే జాతీయ భావోద్వేగాలపై వ్యాఖ్యలు చేసే సమయంలో మరింత జాగ్రత్త అవసరం. రేవంత్ రెడ్డి మాత్రం ఒవైసీ సోదరులను ప్రశంసించడం ద్వారా మజ్లిస్‌తో తన రాజకీయ సంబంధాన్ని బహిరంగంగా చూపించారని బీజేపీ భావిస్తోంది. కాంగ్రెస్ మాత్రం అభివృద్ధి కార్యక్రమాల్లో అందరినీ కలుపుకొని వెళ్లడమే తమ విధానమని చెబుతోంది. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవం చర్చకు వేదికగా మారడం ఆసక్తికరంగా ఉంది. ఒక అభివృద్ధి కార్యక్రమం నుంచి మొదలైన వ్యాఖ్యలు ఇప్పుడు దేశభక్తి, జాతీయ గౌరవం, మత రాజకీయాల వరకు విస్తరించాయి. ఈ అంశంపై తెలంగాణ ప్రజల్లో స్పందనలు కనిపిస్తున్నాయి. కొందరు రామచందర్ రావు విమర్శలను సమర్థిస్తుంటే, మరికొందరు ముఖ్యమంత్రి వ్యాఖ్యలను రాజకీయ స్నేహపూర్వకతగా చూస్తున్నారు. తుది ప్రభావం స్పందనపైనే ఆధారపడి ఉంటుంది. మొత్తంగా చూస్తే తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధానికి ఈ వివాదం మరో కొత్త అంశాన్ని అందించింది.

## ఇస్రో మరో ఘన విజయం

- ఈవోస్-05 విజయవంతంగా ప్రయోగం
- అభినందించిన ప్రధాని నరేంద్రమోడీ

**శ్రీహరికోట: (విశాలభారతి)**


భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో కీలక విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్వీఎఫ్17 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగంలో ఈవోస్05 భూ పరిశీలన ఉపగ్రహాన్ని నిర్దేశిత సబ్‌జియోసింక్రోనస్ ట్రాన్స్ఫర్ ఆర్బిట్ (సబ్ జీటీఓ)లో విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఇస్రో అధికారికంగా కూడా ఈ మిషన్ విజయవంతమైనట్లు ప్రకటించింది. ఈవోస్05 సుమారు 2,367 కిలోల బరువు కలిగిన అధునాతన భూ పరిశీలన ఉపగ్రహం. జీఎస్ఎల్వీఎఫ్17 ప్రయోగ వాహనం ద్వారా దీన్ని ముందుగా సబ్‌జీటీవోలోకి ప్రవేశపెట్టారు. అక్కడి నుంచి ఉపగ్రహం తన స్వంత ప్రొపల్షన్ వ్యవస్థను ఉపయోగించి తుది జియోసింక్రోనస్ ట్రాన్స్ఫర్ ఆర్బిట్ కు చేరుకునేలా మిషన్ రూపొందించారు. ఈవోస్05 ప్రధాన ప్రత్యేకత దాని కక్ష్య. ఇది జియోసింక్రోనస్ ఆర్బిట్ నుంచి ఇమేజింగ్ కార్యకలాపాలు నిర్వహించేందుకు రూపొందించిన భారత తొలి ప్రత్యేక ఇమేజింగ్ ఉపగ్రహంగా గుర్తింపు పొందింది. సుమారు 36,000 కిలోమీటర్ల ఎత్తులో తుది కక్ష్యలో పనిచేసేలా రూపొందించబడిన ఈ ఉపగ్రహం, భారత భూభాగం మరియు పరిసర ప్రాంతాలను విస్తృతంగా, నిరంతరంగా పరిశీలించేందుకు ఉపయోగపడుతుంది. సాధారణంగా తక్కువ ఎత్తులోని భూ పరిశీలన కక్ష్యల్లో తిరిగే ఉపగ్రహాలు ఒకే ప్రాంతాన్ని నిరంతరం చూడలేవు.



# శిల్పారామంలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**మాదాపూర్ - విశాల భారతి**

శిల్పారామం మాదాపూర్, సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నాగ్‌పూర్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శిల్పారామంలోని బృందావనంలో జరిగిన కార్యక్రమాలు భక్తులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.మిత్రాంగం హైదరాబాద్,మహారాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ అంబరీష్ లాహంకార్ నేతృత్వంలో డోల్-తాషా డ్రమ్స్ ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ శ్రావ్య మానస శిష్యబృందం చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలో కోలాటం చేస్తూ సందడి చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన శ్రీ రాజేంద్రసింగ్ బృందం బారెడి నృత్య ప్రదర్శనలతో అలరించింది. శిల్పారామం ప్రధాన లాన్ నుంచి బృందావనం వరకు కళాకారులు, చిన్నారులతో నిర్వహించిన ఊరేగింపు ఉత్సాహభరితంగా సాగింది. అనంతరం బృందావనంలో కోలాటం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. జన్మాష్టమిని పురస్కరించుకుని బృందావనాన్ని రంగురంగుల పూలు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో సందర్శకులు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.



# అసెంబ్లీకి రాని ప్రతిపక్ష నేత ఎందుకు?

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

ప్రజలు ఎన్నుకున్న ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభలో ప్రజా సమస్యలపై గళం వినిపించాల్సిన కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమవుతున్నారని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడి బాధ్యతలను నిర్వర్తించలేని పక్షంలో కేసీఆర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రోహిత్ ఆధ్వర్యంలో గాంధీభవన్ నుంచి అమరవీరుల స్థూపం వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. శాసనసభ ప్రజా సమస్యలపై చర్చించేందుకు రాజ్యాంగబద్ధమైన వేదిక అని, ప్రతిపక్ష నాయకుడిగా ఆ వేదికకు హాజరై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

**ఫామ్‌హౌస్ నుంచే రాజకీయమా?**

ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఉంటూ అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటం పట్ల కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు, నిరుద్యోగం, రైతులు, సంక్షేమం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన సమయంలో అసెంబ్లీకి రాకపోవడం ద్వారా ప్రతిపక్ష నాయకుడి బాధ్యతను




విస్మరిస్తున్నారని ఆరోపించారు.

**ప్రజల గొంతుక అసెంబ్లీలో వినిపించాలి**

ప్రజలు తమ సమస్యలను చట్టసభలో ప్రస్తావించేందుకు ప్రతినిధులను ఎన్నుకుంటారని కాంగ్రెస్ నేతలు అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ప్రజల తరఫున అసెంబ్లీలో చురుకైన పాత్ర పోషించాలని డిమాండ్ చేశారు. సభకు హాజరు కాకుండా పదవిలో కొనసాగడం సమంజసం కాదని, బాధ్యతలు నిర్వర్తించలేకపోతే వెంటనే రాజీనామా చేయాలని స్పష్టం చేశారు.

**యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం**

ఈ ర్యాలీలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావుతో కలిసి తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యతలను నిర్వర్తించే వరకు, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో సమర్థవంతంగా గళం వినిపించే వరకు కాంగ్రెస్ తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని నాయకులు పేర్కొన్నారు.



# సీఎంఆర్ఎఫ్‌తో పేద కుటుంబాలకు భరోసా

- 84 మందికి రూ.53.24 లక్షల చెక్కులు పంపిణీ
- పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ

**శేరిలింగంపల్లి - విశాల భారతి**

అత్యవసర వైద్య చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన 84 మంది బాధితులకు మంజూరైన రూ.53,24,150 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేశ్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని తెలిపారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందించినందుకు బాధిత కుటుంబాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, చంద్రకాంత్‌రావు, వెంకట్‌రావు, ఇబ్రహీం, గణేశ్ పాల్గొన్నారు.

# ఇంటికి చేరిన 'అమ్మ'.. కుటుంబంలో ఆనందం




కుటుంబ సభ్యులకు తల్లిని అప్పగిస్తున్న జీడిమెట్ల పోలీసులు

- ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిన 80 ఏళ్ల వృద్ధురాలు
- జీడిమెట్ల పోలీసులు చొరవతో క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగింత

**సైబరాబాద్ - విశాల భారతి**

కుటుంబ సమస్యల నేపథ్యంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చిన 80 ఏళ్ల వృద్ధురాలిని జీడిమెట్ల పోలీసులు గుర్తించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లి ఆచూకీ తెలియక ఆందోళన చెందిన కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.జగద్గిరిగుట్టలోని దేవమ్మబస్తీకి చెందిన చంద్రమ్మ (80), నరహరి భార్య, కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లో ఎవరికీ సమాచారం ఇవ్వకుండా బయటకు వచ్చారు. అనంతరం జీడిమెట్ల ప్రాంతంలో ఆమె ఒంటరిగా తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన జీడిమెట్ల పోలీస్ సిబ్బంది వృద్ధురాలిని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు.ఆమెతో మాట్లాడి కుటుంబ వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేసిన పోలీసులు.. అనంతరం బంధువులు, కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. ఈ క్రమంలో చంద్రమ్మ కుమారుడు ఆలీ యాదగిరిని గుర్తించి సమాచారం అందించారు.శుక్రవారం చంద్రమ్మను ఆమె కుమారుడికి క్షేమంగా అప్పగించారు.తల్లి సురక్షితంగా తిరిగి ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. వృద్ధురాలిని సకాలంలో గుర్తించి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చిన జీడిమెట్ల పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# చందానగర్‌లో రోడ్డు పనుల పరిశీలన

- రూ.45 కోట్లతో ప్రధాన రహదారి విస్తరణ
- పనుల్లో వేగం పెంచాలి.. నాణ్యతలో రాజీ వద్దు
- పిఏసి చైర్మన్ అరికెపూడి ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి - విశాల భారతి**



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ స్థానిక నాయకులు

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తెలిపారు. చందానగర్ డివిజన్ పరిధిలో జాతీయ రహదారి నుంచి శ్రీదేవి థియేటర్ రోడ్డు మీదుగా అమీన్‌పూర్ వరకు రూ.45 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి విస్తరణ పనులను ఆయన పరిశీలించారు.మొత్తం 2.7 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల ప్రధాన రహదారితోపాటు రెండు వరుసల సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే జాతీయ రహదారి నుంచి శ్రీదేవి థియేటర్ రోడ్డుకు అనుసంధానించే లింక్ రోడ్డు, నాలాపై నిర్మిస్తున్న బాక్స్ కల్వర్టు పనులను మాజీ కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేసిన ఎమ్మెల్యే గాంధీ.. లింక్ రోడ్డు, బాక్స్ కల్వర్టు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. నాలాలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా కల్వర్టు నిర్మాణం చేపట్టాలని సూచించారు.పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని గాంధీ తెలిపారు. రోడ్ల విస్తరణ, అనుసంధాన రహదారుల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్యాయంపై ప్రశ్నిస్తూ.. బాధితులకు అండగా నిలుస్తా

**సతీష్ యాదవ్‌కు మానవ హక్కుల జిల్లా అధ్యక్ష బాధ్యతలు**

**మియాపూర్ - విశాల భారతి**



నియామక పత్రం అందుకుంటున్న సతీష్ యాదవ్

అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు, మియాపూర్ ఎస్ఎంఆర్ వినయ్ ఐలాండ్స్ నివాసి డాక్టర్ సతీష్ యాదవ్‌కు మరో కీలక బాధ్యత దక్కింది. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్ ఆర్గనైజేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఆయన నియమితులయ్యారు. గురువారం రాత్రి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ చేతుల మీదుగా సతీష్ యాదవ్ నియామక పత్రాన్ని అందుకున్నారు.ప్రస్తుతం రెండు నెలల పాటు రంగారెడ్డి జిల్లా బాధ్యతలను నిర్వహించనున్న ఆయనకు అనంతరం రాష్ట్రస్థాయిలో పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ వెల్లడించారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు అఫ్జల్, జాతీయ అధ్యక్షుడు, ఇతర రాష్ట్ర సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పేదలు, పీడిత వర్గాలకు అండగా నిలవడంతో పాటు ఎక్కడ అన్యాయం జరిగినా బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతానన్నారు. మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని తెలిపారు.అఖిలపక్ష ఐక్యవేదికను రాష్ట్రస్థాయిలో విస్తరించేందుకు త్వరలో అన్ని జిల్లాలకు అధ్యక్షులను నియమించనున్నట్లు సతీష్ యాదవ్ తెలిపారు. అదేవిధంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్ ఆర్గనైజేషన్‌ను మరింత విస్తృతం చేసి ప్రజలకు చేరువ చేస్తామని పేర్కొన్నారు.



నోటీసులు పరిశీలిస్తున్న ఏఈఆర్ ఓ చాముండేశ్వరి

# హైదర్‌నగర్‌లో సర్ నోటీసులపై విచారణ

- పలు పోలింగ్ కేంద్రాల వద్ద నోటీసుల పంపిణీ
- పెండింగ్ నోటీసులపై సమీక్ష

**సైబరాబాద్ - విశాల భారతి**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదర్‌నగర్ వార్డు పరిధిలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. వివిధ పోలింగ్ స్టేషన్ ప్రాంతాల్లో సర్ నోటీసుల పంపిణీతో పాటు, వాటికి సంబంధించిన విచారణ ప్రక్రియను పరిశీలించారు.ఆల్విన్ కాలనీ సర్కిల్-51, శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని డీసీ/ఏఈఆర్ఓ చాముండేశ్వరి ఆధ్వర్యంలో సర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఇప్పటికే జారీ చేసిన నోటీసులపై ఎంతమేర విచారణ పూర్తయింది, ఇంకా ఎన్ని నోటీసులు పంపిణీ చేయాల్సి ఉందనే వివరాలను క్షేత్రస్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఇంకా పెండింగ్‌లో ఉన్న నోటీసులను సంబంధిత ఓటర్లకు త్వరితగతిన అందజేయాలని సూచించారు. నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సర్ ప్రక్రియను పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని చాముండేశ్వరి సూచించారు.

# గోపనపల్లి ఇస్కాన్ ఆలయంలో ఘనంగా జన్మాష్టమి వేడుకలు

**శ్రీకృష్ణుడిని దర్శించుకున్న కాంగ్రెస్ నేతలు పల్లపు సురేందర్, రాజు నాయక్**

**శేరిలింగంపల్లి - విశాల భారతి**

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గోపనపల్లిలోని ఇస్కాన్ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు శ్రీకృష్ణ నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.ఈ సందర్భంగా నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్, రాజు నాయక్ ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.జన్మాష్టమి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులు కృష్ణుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న పల్లపు సురేందర్, రాజు నాయక్

# అర్ధరాత్రి పోలీస్ విధులపై అదనపు ఎస్పీ ఆకస్మిక తనిఖీ

- పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్, బీట్ సిబ్బంది విధుల పరిశీలన
- అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

**మెదక్, విశాల భారతి:** రాత్రి వేళల్లో పోలీసు సిబ్బంది నిర్వహిస్తున్న పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్, బీట్ డ్యూటీలను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో పర్యటించి విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. అనుమానితుల వివరాలను ఫింగర్‌ప్రింట్ ఆధారిత పాపిలాన్ డివైస్ ద్వారా పరిశీలించాలని సూచించారు. వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లాడ్జీలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కొత్తగా బస చేస్తున్న వారి వివరాలను పరిశీలించాలని సూచించారు. బీట్ సిబ్బంది తమ పరిధిలోని కాలనీలు, ప్రధాన కూడళ్లు, రహదారుల్లో విస్తృతంగా పర్యటిస్తూ నేరాల నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. దొంగతనాలు, ఇతర ప్రాపర్టీ నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ముందస్తు చర్యలతో నేరాలను అరికట్టాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. విధుల్లో ఉన్న సిబ్బంది బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

# విశాలభారతి కథనం.. స్పందించిన కౌన్సిలర్





- వాటర్ పైప్ లీకేజీకి మరమ్మత్తులు ప్రారంభం
- కౌన్సిలర్ జ్యోతి రమేష్ గౌడ్ పై స్థానికులు హర్షం వ్యక్తం

**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణంలోని 14 వ వార్డు శ్రీ కంఠమహేశ్వర కాలనీలో గత కొద్ది రోజులుగా వేధిస్తున్న మంచినీటి పైప్ లీకేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఈ సమస్యపై విశాల భారతి పత్రికలో వార్త ప్రచురితం కాగానే స్థానిక కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్ తక్షణమే స్పందించారు. వివరాల్లోకి వెళితే... కాలనీ ప్రధాన రహదారిలో మంచినీటి పైప్ లైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా రోడ్డుపైకి వస్తోంది. దీంతో రహదారి అంతా బురదమయంగా మారడంతో పాటు, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా తాగునీరు వృథా అవుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను విశాల భారతి పత్రిక వెలుగులోకి తీసుకురావడంతో, కౌన్సిలర్ జ్యోతి రమేష్ గౌడ్ వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వారి ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం వాటర్ వర్క్స్ సిబ్బంది, మరమ్మత్తు సామగ్రితో సంఘటనా స్థలానికి చేరుకుని లీకేజీ మరమ్మత్తు పనులను ప్రారంభించారు. పైప్ లైన్ లీకేజీని గుర్తించి తవ్వకాలు జరిపి మరమ్మత్తులు చేస్తున్నారు.త్వరలోనే పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని సిబ్బంది తెలిపారు. వార్త రాగానే స్పందించి సమస్యను పరిష్కరించిన కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్ కు, సమస్యను ప్రజల దృష్టికి తీసుకొచ్చిన విశాల భారతి యాజమాన్యానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై విశాల భారతి పత్రిక ఎప్పుడూ ముందుంటుంది. ఎక్కడ సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకురండి, "తక్షణమే పరిష్కరిస్తాం" అని కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు.

# ప్రభుత్వ భూములు కాపాడేదెవరు..?

- కబ్జా కోరల్లో కురవి గ్రామ రెవిన్యూ ప్రభుత్వ భూములు
- చేతులు మారుతున్న కోట్ల విలువైన భూములు
- ప్రభుత్వ భూములకు ప్రైవేట్ నెంబర్లతో రిజిస్ట్రేషన్ల ఆరోపణలు
- సర్వే నెం.177పై దళిత నాయకుల ఫిర్యాదులు
- కురవిలో మొత్తం 275 ఎకరాల 22 గుంటలు రెవిన్యూ అధికారులు ఎందుకు దాస్తున్నారు?
- జిల్లా కలెక్టర్ స్పందించి లెక్క తెల్చాల్సిందే.., ప్రజల డిమాండ్




**కురవి, విశాల భారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామ రెవిన్యూ పరిధిలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూముల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ప్రజా సంఘాల నాయకులు, దళిత నాయకులు ఆరోపిస్తున్నారు. విలువైన ప్రభుత్వ భూములు చేతులు మారుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో సమగ్ర భూసర్వే నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వ భూములకు ప్రైవేట్ నెంబర్లతో రిజిస్ట్రేషన్లు..?**

కురవి లోని కొన్ని ప్రభుత్వ భూములకు ప్రైవేట్ సర్వే నెంబర్లు, బై నెంబర్లను ఉపయోగించి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా సర్వే నెం.177కు సంబంధించిన బై నెంబర్లపై ఇప్పటికే దళిత నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఆరోపణలపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**ప్రజావాణిలో ఫిర్యాదు.. అయినా చర్యలు ఎక్కడ..?**

ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణలపై ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేసినా సంబంధిత అధికారులు తగిన స్థాయిలో స్పందించడం లేదని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూముల హద్దులను గుర్తించి, సర్వే నిర్వహించి, భూముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం.**

కురవి లోని ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం సమర్పించినట్లు సమాచారం. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, కాలువలు, ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన స్థలాలను గుర్తించి రక్షించాలని వారు కోరుతున్నారు. ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వ భవనాలకు భూమి లేదంటూ.. మరోవైపు 275 : 22 ఎకరాల భూమి ఎక్కడ..?**

కురవిలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ప్రభుత్వ భూమి లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో 275 : 22 ఎకరాల ప్రభుత్వ భూమి విషయంలో కూడా స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఈ భూమి ప్రభుత్వ రికార్డుల్లో ఏ విధంగా నమోదై ఉంది..? ప్రస్తుతం దాని భౌతిక పరిస్థితి ఏమిటి..? ఎవరి ఆధీనంలో ఉంది..? అనే అంశాలపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వ భూములపై 'దాగుడుమూతలు' ఎందుకు..?**

ప్రభుత్వ భూముల విషయంలో అధికారులు స్పష్టమైన వివరాలు వెల్లడించకుండా దాగుడుమూతలు ఆడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రతి ప్రభుత్వ భూమికి సంబంధించిన సర్వే నంబర్, విస్తీర్ణం, భూమి స్వభావం, ప్రస్తుత ఆక్రమణ పరిస్థితి తదితర వివరాలను బహిరంగపరచాలని ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమన్వయం చేసి సమగ్ర విచారణ నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అంటున్నారు.

**కోట్లు విలువ చేసే భూములు కబ్జాలో ఉంటే బాధ్యత ఎవరిది..?**

కురవి గ్రామం లోనే ప్రభుత్వ భూములపై ఇలాంటి ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల పరిస్థితిపై కూడా సమగ్ర లెక్కలు తేల్చాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి..? వాటి విస్తీర్ణం ఎంత..? ఎన్ని భూములు ఆక్రమణకు గురయ్యాయి..? ఎక్కడ రిజిస్ట్రేషన్లు జరిగాయి..? అనే అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

**క్షేత్రస్థాయి విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి..**

కురవి లోని ప్రభుత్వ భూములపై వస్తున్న ఆరోపణలు, ఫిర్యాదులను అధికారులు తేలికగా తీసుకోకుండా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు నిర్ణయించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ఆక్రమణలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ప్రజా ఆస్తి.. వాటి పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యం ఉండకూడదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. కురవిలో వెలువడుతున్న ఆరోపణలపై జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ జరిపి లెక్క తేల్చి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉంది.



## స్వయం ఉపాధితోనే ఆర్థిక పురోగతి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**లక్కారంలో 'మద్రాస్ ఫిల్టర్ కాఫీ' ప్రారంభించిన మునుగోడు ఎమ్మెల్యే**

**చౌటుప్పల్ విశాల భారతి:** యువత వ్యాపార రంగంలో రాణిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం 8వ వార్డు జాతీయ రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన 'మద్రాస్ ఫిల్టర్ కాఫీ' సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులకు, స్థానికులకు నాణ్యమైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వినయ్, నాయకులు, స్థానిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తంగేడిపల్లిలో ఘనంగా ఉట్ల పండుగ

**ఉట్లు కొట్టి వేడుకను ప్రారంభించిన కొయ్యడ శేఖర్ గౌడ్ బిఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్**



**చౌటుప్పల్,విశాల భారతి:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగేడిపల్లి ఐదవ వార్డు లో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఉట్లు కొట్టే వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ హాజరై ఉట్లు కొట్టి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకృష్ణుని బాల్య లీలలకు ప్రతీక అయిన ఉట్ల పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతుందని, ఇలాంటి పండుగలు గ్రామాల్లో ఐక్యతను, సోదర భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.యువత సనాతన సంప్రదాయాలను మరచిపోకుండా ఇలాంటి ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.గ్రామస్తులందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉట్ల వేడుకను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

## చౌటుప్పల్‌ల్లో చిన్ని కృష్ణుల సందడి

**చూపరులను ఆకట్టుకున్న గోపికల వేషధారణ**



**చౌటుప్పల్ విశాల భారతి:** పట్టణ కేంద్రంలో చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబైతే ఆ అందమే వేరు. పట్టణంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కన్నుల పండుగగా సాగాయి. చిన్నారులు పట్టు పంచెలు, నెమలి పింఛం, చేతిలో మురళితో బాలకృష్ణుడిలా, పట్టు పరికిణీలు, జడలో పూలతో గోపికల తల్లిదండ్రుల సంబురాలు.చిన్నారులు చేసిన కోలాటం, వెన్న దొంగతనం చిన్న నాటిక అందరినీ ఆకట్టుకుంది. "భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో అలరించారు.చివరగా చిన్ని కృష్ణులకు ఉట్టి కొట్టే పోటీ నిర్వహించగా, పిల్లల ఉత్సాహం అంబరాన్ని తాకింది.

## ఆలస్యమైనా ఆప్యాయతతో.. నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి

**పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కుటుంబానికి ప్రత్యేక అభినందనలు**



**బూర్గంపాడు / విశాల భారతి:** బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (మాజీ సర్పంచ్) కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి పొంగులేటి సందర్శించారు. ఇటీవలె ఆగస్టు 23న జరిగిన తన కుమారుడు చెన్నకేశవరెడ్డి -స్రవంతి రెడ్డి వివాహ వేడుకకు మంత్రి అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోయారు. ఈ నేపథ్యంలో తాజాగా పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి నివాసానికి చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు.అనంతరం నూతన వధూవరులు చెన్నకేశవరెడ్డి, స్రవంతి రెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. నూతన దంపతులను ఆశీర్వదిస్తూ వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.వివాహ వేడుకకు హాజరు కాలేకపోయినప్పటికీ, ప్రత్యేకంగా కుటుంబాన్ని సందర్శించి నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి పట్ల పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొద్దిసేపు కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నూతన దంపతులకు మంత్రి ఆశీస్సులు అందించడం పట్ల కుటుంబ సభ్యుల్లో ఆనందాన్ని నింపింది.

## కృష్ణ స్వామి ముదిరాజ్ జయంతిని అధికారకంగా నిర్వహించాలి


**బండా ప్రకాష్,మేకల సారంగపాణి**

**సికింద్రాబాద్, విశాలభారతి :** ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వారసిగూడ శివాజీ చౌక్ వద్ద కృష్ణ స్వామి ముదిరాజ్ 133 వ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథులు విధాన సభ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మేకల సారంగపాణిలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని అన్నారు. పేద ప్రజల కోసం సంక్షేమం కోసం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచి స్వతంత్ర సమరంలో పాల్గొన్న హైదరాబాద్ 4 వ మేయర్ కృష్ణ స్వామి ముదిరాజ్ విద్యావంతుడు బహుముఖ ప్రజ్ఞాశాలి అన్ని రంగాల వారిని ఆదుకున్న మహనీయుడని బండ ప్రకాష్, మేకల సారంగపాణిలు అన్నారు. హైదరాబాదులో అన్ని రంగాలలో అభివృద్ధి పరిచిన, కార్పొరేటర్ గా డిప్యూటీ మేయర్ గా మేయర్ గా నగరానికి సేవలందించారని అట్టడుగునున్న ప్రజానీకానికి అండగా నిలబడ్డారని అన్నారు. ముదిరాజ్ సంక్షేమ సంఘానికి ముదిరాజులను ఏకతాటిపైకి తీసుకురావడానికి, అన్ని కుల సంఘాలను ఏకం చేయడానికి కృష్ణ స్వామి ముదిరాజ్ అనేక పోరాటాలు చేశారని వారిని స్ఫూర్తిగా తీసుకొని యువత మహిళలు ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ్ ముదిరాజ్, యాదగిరి, సతీష్ రాజు, సందీప్, గణేష్ ముదిరాజ్, రాజశేఖర్ రెడ్డి, సురేష్ ముదిరాజ్ ,కరాటే రాజు, నగేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.




## వివాహ మహోత్సవానికి హాజరైన కాసర్ల కోటేశ్వరరావు

- నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



**మోతె /మునగాల, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి వేనేపల్లి వీరబాబు మేనకోడలి వివాహ మహోత్సవ కార్యక్రమం మోతె మండలం మామిళ్ళగూడెంలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల కోటేశ్వరరావుతో పాటు పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కళ్యాణ వేదికపై నూతన వధూవరులను పూలమాలలతో సత్కరించి, అక్షింతలు వేసి దీవించారు. వివాహానికి హాజరైన వారిలో మాజీ మండల అధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎలక నరేందర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల శ్రీనివాస్ ఉన్నారు. వీరితో పాటు మునగాల వర్కింగ్ ప్రెసిడెంట్ దేవినేని రవి, మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తక్కెలపాటి సాయి, మునగాల ఉప సర్పంచ్ కాసర్ల వెంకట్, వార్డు మెంబర్ సాయి సహా పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు వివాహ వేడుకలో పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## అత్తాపూర్ ఇస్కాన్ టెంపుల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు




**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్‌లోని ఇస్కాన్ దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన వారు ఆశీస్సులు పొందారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీకృష్ణుడి చల్లని దీవెనలతో ప్రజలందరికీ సకల శుభాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లారెడ్డి, కొమరన్న, బొక్క బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తలారి చిన్న అమరేందర్‌రెడ్డి, విజయ్, జిత్తు సింగ్, జయనాథ్‌రెడ్డి, రాజు పైలాన్, శశికాంత్ శర్మ, విజయ్ రాథోడ్, లకన్, బాలకృష్ణ, కిట్టు, సాయికుమార్, వెంకటరెడ్డి, మసూదన్‌రెడ్డి, శంకర్‌రెడ్డితో పాటు స్థానిక నాయకులు, యువకులు, ఇస్కాన్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం

- ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు
- రిటైర్డ్ జిహెచ్ఎం ఎంఈఓ పోచం బావి మహేందర్



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఆ మహనీయుని సేవలను ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరుతూ ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపిన రిటైర్డ్ జిహెచ్ఎంఈఓ పి మహేందర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు రాధాకృష్ణన్ బోధించిన తత్వ శాస్త్రం పట్ల ఆధ్యాత్మిక నైతిక విలువలు సంఘ సేవ భావం దేశభక్తి వంటి వాటిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాధాకృష్ణన్ భారత రాష్ట్రపతిగా ఉపరాష్ట్రపతిగా వైస్ ఛాన్స్లర్గా రష్యా రాయబారిగా అధ్యాపకుడిగా తత్వశాస్త్రవేత్తగా ఉపాధ్యాయుడిగా అంచలంచలుగా ఎదిగారని వారిని మనం స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అందుకు నేటి ఆధునిక డిజిటల్ యుగం మానసిక శారీరక ప్రశాంత కొరవడిలో తత్వశాస్త్రం మనోవిజ్ఞాన శాస్త్రం ను గ్రహించి పాఠశాలల్లో ప్రశాంత వాతావరణంలో విద్యార్థుల పట్ల రాధాకృష్ణన్ చూపిన శ్రద్ధ అంకితభావం అలవర్చుకోవలసి ఉన్నదని గుర్తు చేశారు. మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకొని భవిష్యత్తు తరాలకు మరచిపోకుండా కొనసాగాలని మనవి చేశారు.


## చౌటుప్పల్ భవానీ నగర్ లో ఘనంగా కుంకుమార్చన



**చౌటుప్పల్,విశాల భారతి:**

భవానీ నగర్ లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రావణమాసం నాలుగవ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక కుంకుమార్చన కార్యక్రమం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో, ట్రినిటీ విద్యాలయాల సంస్థ మరియు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. కాశీ నుండి ప్రత్యేకంగా తెప్పించిన శ్రీ చక్రాలపై మహిళా భక్తులచే కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితులు శ్రీ పెద్ది సుధాకర్ శర్మ వేద మంత్రోచ్చారణలతో కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కుంకుమార్చనలో పాల్గొన్న ప్రతి భక్తురాలికి శ్రీ భవానీ మాత ఆశీస్సులు ఉండాలని, అమ్మవారి ఆశీస్సులతో చౌటుప్పల్ మున్సిపల్ ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని చక్కగా నిర్వహిస్తున్న దేవాలయ కమిటీ ధర్మకర్తలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, పిల్లలమర్రి మధుసూదన్, కౌన్సిలర్లు శ్రీమతి బత్తుల వాణి విప్లవ్ గౌడ్, శ్రీమతి కాసర్ల మంజుల, కోఆప్షన్ సభ్యులు శ్రీమతి సందగళ్ళ విజయ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షురాలు శ్రీమతి వెన్‌రెడ్డి సంధ్య, ట్రినిటీ విద్యాలయాల ప్రిన్సిపల్ డా. ఉజ్జిని మంజుల, పెద్ది స్వాతి కిషోర్ శర్మ, ధర్మకర్తలు వరకాల రవి గౌడ్, ఆవుల యేసు యాదవ్, దాడి యశ్వంత్ రెడ్డి, గగులోతు అరుణ, బొబ్బిళ్ళ సంధ్య, వర్కాల వెన్నెల, పబ్బు శ్రీకాంత్ గౌడ్, మొగుదాల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే భక్తులు శ్రీమతి మునుకుంట్ల పద్మావతి, సుర్వి మంజుల, దాడి పద్మ, ముతుకులోజు నీరజ, వనం మమత, సింగిరి కొండ శైలజ, బడుగు గౌరీశ్వరి, బొబ్బిళ్ళ యశోద, మన్నె శివరాణి, బొడిగె రాధిక, పగడాల అనూష, మామిడి వెంకటమ్మ, శాలిని, అనూష, ప్రసన్నలక్ష్మి, జూకంటి రేవతి, ఎలమోని హారిక, కాసాని ఐలమ్మ, కీర్తన, పార్శి సంధ్య, పార్శి నికిత, బొబ్బిళ్ళ సామ్రాట్, మునుకుంట్ల శేఖర్ గౌడ్, డాకోజి అజయ్ తదితర భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ప్రచారం



- కాంగ్రెస్ సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు
- ప్రతిపక్షాల విమర్శలు రాజకీయ దురుద్దేశంతోనే
- డోర్నకల్ నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి పనులు
- కురవిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

**కురవి, విశాల భారతి):**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నాయని కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు ప్రత్యక్షంగా గమనిస్తున్నారని అన్నారు. కురవి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ, 67 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డుల మంజూరు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు.

**డోర్నకల్‌లో అభివృద్ధికి కొత్త దిశ.**

ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ కృషితో నియోజకవర్గంలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కురవి మండలంలో సుమారు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, నర్సింహులపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, మరిపెడలో 50 పడకల ఆసుపత్రి, మున్సిఫ్ కోర్టు, వ్యవసాయ మార్కెట్, డోర్నకల్‌లో నైపుణ్యాభివృద్ధి కళాశాల వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఉపయోగపడే ఇంతటి కీలక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆయన విమర్శించారు. మిషన్ కాకతీయ పేరుతో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను ప్రజలు స్వయంగా గమనిస్తున్నారని, ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా వాస్తవాలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమకు ప్రజల్లో మరింత ఆదరణ తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో టౌన్ అధ్యక్షుడు నారాయణ రాజేంద్ర కుమార్, ఆలయ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకటరెడ్డి, మండల యువజన విభాగం ఉపాధ్యక్షుడు కొర్ని అనిల్‌తో పాటు పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# లంగర్‌హౌస్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** లంగర్ హౌస్ లోని ప్రశాంత్‌నగర్ ఫేజ్ 2లో భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సి. మనోజ్ నేతృత్వంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లంగర్‌హౌస్ బీఆర్‌ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు నాగులపల్లి రవికాంత్ హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి బోధనలు సమాజానికి మార్గదర్శకమని, యువత మంచి విలువలను అలవర్చుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పి. వినోద్, కె. సంతోష్, పి. శ్రీధర్, బి. ప్రదీప్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**కృష్ణుడు, రాధ వేషధారణలో చిన్నారుల సందడి**



**విశాల భారతి,అబ్దుల్లాపూర్ మెట్ :** తారామతిపేట్‌గ్రామం లోని లయోలా మోడల్ స్కూల్‌నందు శ్రీకృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో పాల్గొని సందడి చేశారు. విద్యార్థులు నిర్వహించిన భక్తిగీతాలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణుడి బాల్య లీలలను ప్రతిబింబించేలా చిన్నారులు ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థుల ఉత్సాహభరిత ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీకృష్ణుడి జీవితం, బోధనలు, ధర్మం, సత్యం, నైతిక విలువల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల కోసం సమరభేరి

- కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోదీ సర్కార్
- ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయండి
- కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటం: ముత్యాల యాదిరెడ్డి




**విశాల భారతి – అబ్దుల్లాపూర్‌మెట్ :** కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. కార్మికులు దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు మరోసారి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరగనున్న ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్-3 భూ పోరాట కేంద్రంలో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31న ఏర్పడిన ఏఐటీయూసీ దేశంలోనే తొలి కార్మిక సంఘమని, స్వాతంత్ర్య పోరాటంలోనూ సంఘం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం అనేక చట్టాల సాధనలో ఏఐటీయూసీ పోరాటాలు కీలకంగా నిలిచాయని గుర్తుచేశారు.

***44 చట్టాల నుంచి నాలుగు నియమావళుల దాకా..**

కార్మికులు పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాల్లో 29 చట్టాలను సవరించి నాలుగు కార్మిక నియమావళులను కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం కార్మిక హక్కుపైదాడేనని యాదిరెడ్డి ఆరోపించారు. విదేశీ పెట్టుబడిదారులు,కార్పొరేట్ సంస్థలకు అనకూలంగా విధానాలను రూపొందిస్తూ కార్మికుల ప్రయోజనాలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు.

**కార్పొరేట్లకు కాపలాదారుడిగా మోదీ**

పారిశ్రామికవేత్తలకు భూమి, నీరు, విద్యుత్, వివిధ రాయితీలను అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. కార్మికులకు మాత్రం కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. కార్పొరేట్ల ఆస్తులకు కాపలాదారుడిగా ప్రధాని నరేంద్ర మోదీ వ్యవహరిస్తున్నారని యాదిరెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కార్మికులు, పేద ప్రజల శ్రమను దోచుకునే విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు కార్మిక నియమావళులను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించే వరకు, కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, గౌరవం దక్కే వరకు ఏఐటీయూసీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

***మహాసభలకు భారీగా తరలిరావాలి**

కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర మహాసభలకు కార్మికులు, ఏఐటీయూసీ శ్రేణులు భారీగా తరలివచ్చి మహాసభలను జయప్రదం చేయాలని యాదిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బతి లక్ష్మణ్, బీఓసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, పానుగంటి సాయిలు, డవుల రాములు, మంగళపల్లి రవి, కాస శ్రీను, ఆవుల యాదగిరి, పేరాల గోపి, నన్నే సాబ్, వెంకట్, అశోక్, గోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్‌లో విషాదం యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య



**నాచారం 4 సెప్టెంబర్ విశాల భారతి :** నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగలక్ష్మి నగర్, మల్లాపూర్ లో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా, అనుకుంట గ్రామానికి చెందిన పెనిముచ్చి పుష్ప కుటుంబం జీవనోపాధి నిమిత్తం 20 ఏళ్ల క్రితం హైదరాబాద్ కు వచ్చి మల్లాపూర్ నాగలక్ష్మి నగర్ లో నివాసం ఉంటున్నారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.కుమారుడు పెనిముచ్చి మల్లేష్ (18) 9వ తరగతి వరకు చదివి మానేసి, అప్పుడప్పుడు బ్యాండ్ కార్యక్రమాల్లో పనిచేస్తూ ఉండేవాడు.సెప్టెంబర్ 3వ తేదీ సాయంత్రం 6:30 గంటలకు ఇంటికి వచ్చి భోజనం చేసి బయటకు వెళ్లిన మల్లేష్, తెల్లవారుజామున 3:30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో మద్యం మానుకోవాలని, వేరే పని చూసుకోవాలని తల్లి మందలించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం తల్లిని బెడ్ రూమ్ లోకి తోసి బయట గడియ పెట్టాడు. తల్లి బయటకు వచ్చి చూసేసరికి హాల్ లో మల్లేష్ ఉరేసుకుని కనిపించాడు. వెంటనే కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కిందకు దించి ఆటోలో నాచారంలోని ప్రసాద్ హాస్పిటల్ కు తరలించారు. పరీక్షించిన వైద్యులు సెప్టెంబర్ 4వ తేదీ ఉదయం 5:45 గంటలకు అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు నాచారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. తన కుమారుడి మృతిపై ఎటువంటి అనుమానం లేదని, మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది.

# ఈఎస్ఐ వైద్య చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలి


- డిఆర్ఓ కు వినతిపత్రం అందజేసిన సీపీఎం నాయకులు



**విశాలభారతి ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కార్మికులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈఎస్ఐ వైద్య చికిత్స కేంద్రాన్ని కర్నగూడలో కాకుండా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం రంగారెడ్డి జిల్లా డిఆర్ఓ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో వేలాది మంది పారిశ్రామిక కార్మికులు, నిర్మాణ కార్మికులు, హమాలీలు, అసంఘటిత రంగ కార్మికులు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈఎస్ఐ వైద్య సేవలపై ఆధారపడి ఉన్నారని నాయకులు తెలిపారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రాష్ట్రంలో కరువు పరిస్థితులు

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**




కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో పాలన అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ఆరు గ్యారంటీ కార్డులతో పాటు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500, మహిళలకు స్కూటీలు, పెన్షన్ల పెంపు, బిసి బందు, ఎస్సి బందు,కేసీఆర్ కిట్ వంటి హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన విమర్శించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం అధిక ధరకు సిలిండర్ కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని కిషన్ రెడ్డి ఆరోపించారు. గ్రామాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని మంచిరెడ్డి కిషన్ రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల సర్పంచ్, మానుపాటి శోభ కుమార్,మండల అధ్యక్షులు చీరాల రమేష్,ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి, ఏర్పుల చంద్రయ్య, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి, యాచారం సహకార బ్యాంకు చైర్మన్ తోటి రెడ్డి రాజేందర్ రెడ్డి, యాచారం మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్, యాచారం మాజీ ఎంపీపీ రజిత రాజు నాయక్, వంగేటి లక్ష్మారెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువజన యువ నాయకులు జెర్కొని రాజు,మహిళా కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆలీనగర్ హత్య కేసు ఛేదించిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు



**ముగ్గురు నిందితుల అరెస్ట్.. 3 కత్తులు, 2 పెప్పర్ స్ప్రేలు, సెల్‌ఫోన్లు స్వాధీనం**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

ఆలీనగర్‌లో ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి జరిగిన మహ్మద్ అబ్దుల్ రౌఫ్ హత్య కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఛేదించారు. కేసులో ప్రధాన నిందితుడు మహ్మద్ జావీద్ అలియాస్ హెక్లా జావీద్‌తో పాటు అతని సహచరులు మహ్మద్ అబ్దుల్లా, షేక్ ఆరిఫ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో ప్రధాన నిందితుడు జావీద్ వెల్లడించిన వివరాల ప్రకారం.. మృతుడు అబ్దుల్ రౌఫ్ తన తమ్ముడు సాజిద్ మృతికి కారణమని అనుమానిస్తూ జావీద్ కొంతకాలంగా అతనిపై కక్ష పెంచుకున్నాడు. అంతేకాకుండా తనను, తన తమ్ముడి స్నేహితులను మృతుడు బెదిరిస్తూ, ఎగతాళి చేస్తున్నాడని భావించి హత్యకు పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. పథకం ప్రకారం ఈ నెల 2వ తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో అబ్దుల్ రౌఫ్ ఆటోలో వెళ్తుండగా ముగ్గురు నిందితులు అడ్డగించి పెప్పర్ స్ప్రే ప్రయోగించి కత్తులతో దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన రౌఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారై, రక్తపు మరకలున్న దుస్తులు, కత్తులు, పెప్పర్ స్ప్రే బాటిళ్లను పల్లెచెరువు సమీపంలోని పొదల్లో పడేసినట్లు విచారణలో వెల్లడైంది. నిందితులు కర్ణాటకలోని భసవకళ్యాణ్ వైపు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో ఆరాంఘర్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి TS 12 EX 2265 నంబర్ యాక్టివా బైక్, మృతుడికి చెందిన మొబైల్ ఫోన్, నిందితుల రెండు మొబైల్ ఫోన్లు, మూడు కత్తులు, రెండు పెప్పర్ స్ప్రేలు, నిందితులు ధరించిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ప్రధాన నిందితుడు మహ్మద్ జావీద్‌పై హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాలు, కర్ణాటకలో కలిపి సుమారు 180 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరో నిందితుడు మహ్మద్ ఆరిఫ్‌పై మూడు కేసులు, మహ్మద్ అబ్దుల్లాపై ఒక కేసు ఉన్నట్లు వెల్లడించారు. డీసీపీ ఎస్. శ్రీనివాస్ రాజేంద్రనగర్, ఏసీపీ తులా శ్రీనివాస్ చంద్రాయణగుట్ట ఆదేశాల మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసును దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# ఇబ్రహీంపట్నం కేంద్రంలోనే ఈఎస్ఐ వైద్య చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలి

**డిఆర్ఓ కు వినతిపత్రం అందజేసిన సీపీఎం నాయకులు**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కార్మికులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈఎస్ఐ వైద్య చికిత్స కేంద్రాన్ని కర్నగూడలో కాకుండా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం రంగారెడ్డి జిల్లా డిఆర్ఓ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో వేలాది మంది పారిశ్రామిక కార్మికులు, నిర్మాణ కార్మికులు, హమాలీలు, అసంఘటిత రంగ కార్మికులు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈఎస్ఐ వైద్య సేవలపై ఆధారపడి ఉన్నారని నాయకులు తెలిపారు. ప్రస్తుతం ఈఎస్ఐ వైద్య సేవల కోసం కార్మికులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో పనిదినాలు, వేతనాలు, సమయం కోల్పోవడంతో పాటు ప్రయాణ ఖర్చులు కూడా భరించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు కోసం కర్నగూడలో భవనం వినియోగించే ప్రతిపాదన ఉన్నప్పటికీ, నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ఇబ్రహీంపట్నం పట్టణంలోనే వైద్య చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సముచితమని వారు అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అనువైన భవనం లేదా స్థలాన్ని గుర్తించి ఈఎస్ఐ డిస్పెన్సరీకి కేటాయించాలని, అవసరమైన వైద్యులు, సిబ్బంది, మందులు, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈఎస్ఐ వైద్య చికిత్స కేంద్రాన్ని కర్నగూడకు పరిమితం చేయకుండా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోనే ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డిఆర్ఓ ను కోరారు.ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి సామెల్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సిహెచ్ బుగ్గరాములు జిల్లా కమిటీ సభ్యులు జగన్ పోల్కంపల్లి, సిపిఎం నాయకులు వెంకన్న, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా రాము



**కార్యదర్శిగా వేములపల్లి ప్రవీణ్ ఏకగ్రీవ ఎన్నిక**

**పాల్వంచ విశాలభారతి:** పాల్వంచ పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాల్వంచ గణేష్ ఉత్సవ సమితి-2026 నూతన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. సమితి అధ్యక్షుడిగా పసుమర్తి (గోల్డ్) రాము, కార్యదర్శిగా వేములపల్లి ప్రవీణ్ ఎన్నికయ్యారు. పట్టణంలోని జయమ్మ కాలనీలో గల శ్రీ లక్ష్మీ లేక్ వ్యూ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పాల్వంచ గణేష్ ఉత్సవ సమితి సమావేశంలో కమిటీ సభ్యులు పసుమర్తి (గోల్డ్) రామును అధ్యక్షుడిగా, వేములపల్లి ప్రవీణ్‌ను కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పసుమర్తి (గోల్డ్) రాము మాట్లాడుతూ.. పట్టణంలోని హిందువులందరూ ఎలాంటి వివాదాలకు, అల్లర్లకు తావులేకుండా గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ అధికారులు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పాల్వంచ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు చిలుకూరి నాగేశ్వరరావు, చింతలచెరువు శ్రీనివాస్, రాపాక రమేష్, చెరుకు భాగ్యలక్ష్మి, గంగాధరి సీత, చల్లా లింగన్న, విజయ్ శంకర్, శ్రీరామోజు మధుసూదనచారి, రామగిరి ప్రసాద్, రంజిత్, దాసరి మాధవరావు, నూకల సతీష్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# శారద విద్యానికేతన్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- శ్రీకృష్ణ–రాధాగోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** నాగార్జున గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన శారద విద్యానికేతన్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్యాతం అశోక్ యాదవ్, ఎంపీటీసీ జల్లి సాయిరాం ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో సందడి చేస్తూ ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథి క్యాతం అశోక్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాని సాధనకు కృషి చేయాలని సూచించారు. విద్యతో పాటు చిన్ననాటి నుంచే పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఎదిగి మంచి పౌరులుగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. కరస్పాండెంట్ పూర్ణిమా భరత్ కుమార్ మాట్లాడుతూ పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను పిల్లలకు తెలియజేయడంతో పాటు శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధించిన సద్గుణాలను వారికి వివరించాలని అన్నారు. ప్రిన్సిపల్ నీరజ విద్యార్థులకు జన్మాష్టమి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. దాదాపు 200 మంది విద్యార్థులకు ప్రిన్సిపల్ నీరజ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇన్స్టగ్రామ్‌లో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు స్టోరీ

- సకాలంలో యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు
- పోలీసులకు సెల్యూట్ చేసిన కుటుంబ సభ్యులు



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** ఇన్‌స్టాగ్రామ్‌లో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు స్టోరీ పెట్టిన యువకుడిని సకాలంలో గుర్తించి కాపాడిన పోలీసులు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లపాడకల్ గ్రామానికి చెందిన చేపంగి కిషోర్, తండ్రి బాలయ్య అనే 23 సంవత్సరాల యువకుడు తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు Instagramలో Story పోస్ట్ చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించిన సైబర్ క్రైమ్, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ అధికారులు, సదరు వ్యక్తి హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నట్లు గుర్తించి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే సెక్టార్ ఎస్సై జి. సైదులు పెట్రోల్ మొబైల్ సిబ్బంది అప్రమత్తమై, ముచ్చర్ల గ్రామ శివారులో గాలింపు చేపట్టి సదరు యువకుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సకాలంలో స్పందించి అతడిని ఆత్మహత్యకు పాల్పడకుండా కాపాడారు.విచారణలో సదరు యువకుడు తన స్వగ్రామం కొల్లపాడకల్ గ్రామం, మహేశ్వరం మండలం అని, బోనాల పండుగ సందర్భంగా తన మేనమామ గ్రామమైన ముచ్చర్లకు వచ్చినట్లు తెలిపాడు. ప్రేమ విఫలమైన కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు వెల్లడించాడు.అనంతరం సదరు యువకుడిని అతని కుటుంబ సభ్యులకు అప్పగించి, కుటుంబ సభ్యులకు తగిన విధంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసులు సకాలంలో స్పందించి ఒక యువకుడి ప్రాణాలను కాపాడినందుకు స్థానిక గ్రామస్తులు సెక్టార్ ఎస్సై జి. సైదులు ని, అలాగే పెట్రోల్ మొబైల్ సిబ్బంది A. ప్రశాంత్, PC11349; P. శ్రీనివాస్, HG2031; P. చంద్రశేఖర్, HG1389లను అభినందించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుంది

- బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జై సింహా..

**ముషీరాబాద్ విశాల భారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జై సింహా ఆరోపించారు. ప్రభుత్వం 1,000 రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గం బోలక్ పూర్ డివిజన్ లో వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ముచ్చ కుర్తి ప్రభాకర్ సమన్వయంలో జరిగిన కార్యక్రమానికి ముషీరాబాద్ నియోజకవర్గ డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులతో కలిసి ముఠా జై సింహ హాజరై నిరసన తెలిపి మాట్లాడారు..మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో వికలాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, మహిళా విద్యార్థినులకు స్కూటీలు, తులం బంగారం, రైతులకు రైతు భరోసా వంటి పలు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు.మొత్తం 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కిందని విమర్శించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళలు, రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ హామీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని కోరారు. హామీల అమలుపై ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, కాల్వ శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, నేత శ్రీనివాస్, సోమన్, రోషం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.





# హీరోయిన్ల వివాదంపై తాప్సీ షాకింగ్ కామెంట్స్..

సినిమాల్లో హీరోయిన్లను చూపించే విధానం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన రామ్ చరణ్ 'పెద్ది' , కన్నడ స్టార్ హీరో యష్ నటించిన 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రాల్లో మహిళా పాత్రలను ప్రెజెంట్ చేసిన తీరుపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. హీరోయిన్ల పాత్రలు, వారి లుక్, దుస్తులు, కెమెరా యాంగిల్స్ విషయంలో గ్లామర్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారనే అభిప్రాయాలు నెటిజన్ల నుంచి వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా హీరోయిన్ తాప్సీ పన్ను చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తన తాజా చిత్రం 'గాంధారి' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తాప్సీ.. సినిమా పరిశ్రమలో 'డిమాండ్ అండ్ సప్లై' విధానం, సోషల్ మీడియా విమర్శలు, ప్రేక్షకుల అభిరుచులపై కీలక వ్యాఖ్యలు చేసింది. సినిమాల్లో హీరోయిన్లను గ్లామర్‌గా చూపించడంపై సోషల్ మీడియాలో వచ్చే విమర్శల గురించి తాప్సీని ప్రశ్నించగా.. డిజిటల్ ప్రపంచానికి, గ్రౌండ్ లెవల్‌లో ఉన్న ప్రేక్షకుల అభిప్రాయాలకు చాలా తేడా ఉంటుందని ఆమె చెప్పింది. ముఖ్యంగా మాస్ సినిమాల విషయంలో సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు సినిమాలపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని తాప్సీ అభిప్రాయపడింది. నెట్‌లో ఎంత చర్చ జరిగినా.. అదే గ్లామర్ ఫొటోలను జూమ్ చేసి, వివిధ యాంగిల్స్‌లో వీడియోలు తయారు చేసి వైరల్ చేసే వాళ్లు కూడా సోషల్ మీడియాలోనే ఉన్నారని ఆమె పేర్కొంది. అంటే ఒకవైపు అదే కంటెంట్‌ను విమర్శిస్తూ.. మరోవైపు దానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను వైరల్ చేయడం కూడా జరుగుతోందని తాప్సీ చెప్పుకొచ్చింది. దీనిని బట్టి అలాంటి కంటెంట్‌కు సోషల్ మీడియాలో కొంత మేర ఆదరణ ఉందనే విషయాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని ఆమె అభిప్రాయపడింది. సినిమా పరిశ్రమలో ఇలాంటి పరిస్థితులు ఎందుకు వస్తున్నాయన్న దానిపై తాప్సీ తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. ఇండస్ట్రీలో కూడా డిమాండ్ అండ్ సప్లై సూత్రమే పనిచేస్తుందని ఆమె చెప్పింది. ప్రేక్షకులు ఇలాంటి కంటెంట్‌ను కోరుకుంటున్నారని, దాని ద్వారా సినిమాలకు డబ్బులు వస్తాయని నిర్మాతలు, దర్శకులు భావించినప్పుడు అదే తరహా సినిమాలు, సన్నివేశాలు తెరకెక్కుతాయని తాప్సీ పేర్కొంది. అలా క్రమంగా సినిమా కథ, కళ, నటన వంటి అంశాలు వెనక్కి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని ఆమె అభిప్రాయపడింది. కరోనా మహమ్మారికి ముందు సినీ పరిశ్రమ మంచి మార్పు దిశగా పయనించిందని తాప్సీ చెప్పింది. అయితే ప్రస్తుతం మళ్లీ కొన్ని పాత పద్ధతులు తిరిగి వస్తున్నాయని ఆమె అభిప్రాయపడింది. సినిమా ఆశించిన స్థాయిలో లేకపోతే దానికి ప్రేక్షకుల అభిరుచులను కారణంగా చూపుతూ మేకర్స్ తప్పించుకునే పరిస్థితి ఉందని తాప్సీ వ్యాఖ్యానించింది. నటీనటులు పరిశ్రమలో మార్పు కోసం ఎంత ప్రయత్నించినా.. ప్రేక్షకుల నుంచి మద్దతు లేకపోతే ఆ పోరాటంలో విజయం సాధించడం కష్టమని ఆమె చెప్పుకొచ్చింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.